

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY







PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 12-05-2022 సంపుటి : 03 సంచిక : 235 పేజీలు : 4 వెల : రూ 3-00


# హై అలర్ట్‌గా ఉండాలి..

## సీఎం జగన్ అత్యవసర వీడియో కాన్ఫరెన్స్



అమరావతి: తుపాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, అధికారులతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యవసర వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సహాయక చర్యలపై సమీక్ష జరిపారు. ఇప్పటికే తొమ్మిది ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను జిల్లాలకు ప్రభుత్వం పంపింది. తుపాను నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై సీఎం ఆదేశాలు జారీ చేశారు. తుపాను నేపథ్యంలో హై అలర్ట్‌గా ఉండాలన్నారు. ఇప్పటికే మీకు నిధులు ఇచ్చామని, తుపాను తీరం వెంబడి ప్రయాణిస్తోంది కాబట్టి తీర ప్రాంతాల్లో మరింత అప్రమత్తం అవసరమని" కలెక్టర్లు, అధికారులకు సీఎం సూచించారు. "కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. తుపాను బలహీనపడటం ఊరటనిచ్చే అంశం. అయినా ఎక్కడా నిర్లక్ష్యానికి తావు ఉండకూడదు. ప్రజలకు ఎలాంటి ముప్పు రాకుండా చూడాలి. ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించండి. అవసరమైన చోట సహాయపునరావాస శిబిరాలను తెరవండి. సహాయ శిబిరాలకు తరలించిన ఒక వ్యక్తికి రూ.వెయ్యి, కుటుంబానికి రూ.2వేల చొప్పున ఇవ్వండి. సహాయ శిబిరాల్లో మంచి సౌకర్యాలు ఏర్పాటు చేయండి. జనరేటర్లు, జేసీబీలు.. ఇవన్నీకూడా సిద్ధంచేసుకోండి. కమ్యూనికేషన్ వ్యవస్థకు అంతరాయం ఏర్పడితే వెంటనే చర్యలు తీసుకోవాలని" సీఎం అన్నారు. "తుపాను బాధితుల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించండి. వారికి ఎలాంటి కష్టం వచ్చినా వెంటనే ఆదుకోవాలి. పరిహారం ఇచ్చే విషయంలో ఎలాంటి సంకోచాలు పెట్టుకోవద్దు. సెంట్రల్ హెల్ప్ లైన్‌తో పాటు, జిల్లాల వారీగా హెల్ప్‌లైన్ నంబర్లు సమర్థవంతగా పనిచేసేలా చూడాలి. వచ్చే కాల్స్ పట్ల వెంటనే స్పందించండి. ఈ నంబర్లకు బాగా ప్రచారం కల్పించాలని" సీఎం పేర్కొన్నారు. అసని తుపాను ప్రభావంతో విశాఖ, తుర్పుగోదావరి, పశ్చిమగోదావరి, గుంటూరు, కృష్ణా జిల్లాలలో భారీ వర్షాలు పడనున్నాయి. విశాఖపై అసని తుపాన్ ప్రభావం ఎక్కువగా ఉంది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. ఏపీ తీర ప్రాంతాల్లో ఎన్డీఆర్ఎఫ్ బృందాలను మొహరించారు. తీర ప్రాంత మండలాల్లో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. మత్స్యకారులను వేటకు వెళ్లొద్దని హెచ్చరించారు. మరోవైపు పలువురు మంత్రులు అసని తుపాను ప్రభారంపై ఎప్పటికప్పుడు వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు. సహాయక చర్యల కోసం సిద్ధంగా ఉండాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

# 'రాజద్రోహం చట్టం'పై స్టే విధించిన సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ: రాజద్రోహం చట్టంపై సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు వెలువరించింది. ఇప్పటివరకూ ఉన్న రాజద్రోహం కేసులపై స్టే విధిస్తున్నట్లు ప్రకటించింది. రాజద్రోహం కేసులన్నీ ప్రస్తుతానికి నిలిపివేస్తున్నట్లు బుధవారం నాటి తీర్పులో వెల్లడించింది. ఈ క్రమంలోనే రాజద్రోహం చట్టం కింద అరెస్టయిన వాళ్లంతా బెయిల్ పిటిషన్ పెట్టుకోవచ్చని తెలిపిందిసుప్రీంకోర్టు. కొత్తగా రాజద్రోహం కింద ఎలాంటి కేసులు నమోదు చేయవద్దని సూచించింది. రాజద్రోహం కేసుకు సంబంధించిన చట్టాలను పునః పరిశీలించాలని పేర్కొన్న సుప్రీం.. సెక్షన్ 124ఎ కింద నమోదైన కేసులన్నింటినీ పునః పరిశీలించాలని ఆదేశాలు జారీ చేసింది. కాగా, బ్రిటీష్ వలస కాలం నుంచి అమల్లో ఉన్న దేశద్రోహ (సెక్షన్ 124ఏ) చట్టాన్ని పునఃసమీక్షిస్తారా? ఆ చట్టం కింద కేసులు నమోదైన పౌరుల ప్రయోజనాలు కాపాడేందుకు వీలుగా అప్పటిదాకా పెండింగ్ కేసులన్నింటినీ పక్కన పెడతారా? పునఃసమీక్ష పూర్తయ్యేదాకా దేశద్రోహం కింద కొత్త కేసులు పెట్టకుండా ఉంటారా?" అని కేంద్రాన్ని సుప్రీంకోర్టు మంగళవారం ప్రశ్నించింది. ఈ అంశాలపై స్పష్టమైన వైఖరి తీసుకోవాల్సిందిగా సూచించింది. అయితే రాజద్రోహం చట్టాన్ని పునః పరిశీలిస్తామని కేంద్రం స్పష్టం చేసిన నేపథ్యంలో ఆ చట్టాన్ని ప్రస్తుతానికి నిలిపివేస్తున్నట్లు సుప్రీం నేటి తీర్పులో ప్రకటించింది. ఈ చట్టాన్ని సమీక్షించే వరకూ స్టే విధిస్తున్నట్లు దేశ అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. అప్పటివరకూ ఈ చట్టం కింద కేసులు నమోదు చేయవద్దని ఆదేశించింది.

# కేంద్ర జల సంఘానికి రాష్ట్ర ప్రభుత్వం లేఖ..

హైదరాబాద్ : కేంద్ర జల సంఘానికి రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసింది. కర్ణాటకలోని అప్పర్ తుంగ, అప్పర్ భద్ర ప్రాజెక్టులకు అనుమతులపై అభ్యంతరం తెలుపుతూ ప్రాజెక్టు అప్రయిజల్ డైరెక్టరేట్‌కు ఈఎన్సీ మురళీధర్ లేఖ రాశారు. రెండు ప్రాజెక్టులకు అనుమతులు నిలిపివేయాలని లేఖలో విజ్ఞప్తి చేశారు. అంతర్ రాష్ట్ర అంశాలు, ట్రిబ్యునల్ తీర్పులను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ఈ రెండింటిని పరిగణనలోకి తీసుకోకుండా అనుమతులు ఇవ్వరాదని సూచించారు. అనుమతులిస్తే కృష్ణాకు తుంగభద్ర నుంచి ప్రవాహం తగ్గుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రయోజనాలపై తీవ్రంగా ప్రభావం చూపుతుందన్నారు. ఈ రెండు ప్రాజెక్టులకు బచావత్ ట్రైబ్యునల్ కేటాయింపులు చేయలేదని ఈఎన్సీ మురళీధర్ స్పష్టం చేశారు. బ్రిజేష్ ట్రైబున్యల్ కేటాయింపులున్నా సుప్రీంకోర్టులో కేసులు పెండింగ్‌లో ఉన్నాయని గుర్తు చేశారు. దిగువన ఉన్న రాష్ట్రాల అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.



# ఆ 24 సీట్లు కోసమే ప్రతిపక్షాలు పోరాడాలి: కొడాలి నాని



కృష్ణా జిల్లా: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి నాని అన్నారు. గుడివాడ 22వ వార్డులో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభమైంది. ఎమ్మెల్యే కొడాలి నాని?, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పొల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కొడాలి నాని మాట్లాడుతూ.. ప్రతి కుటుంబానికి లబ్ది చేకూరుస్తున్న వ్యకి? ప్రస్తుతం మనకు ముఖ్యమంత్రిగా ఉన్నారు. చంద్రబాబు తన కొడుకు, మనవడిని ఇంగ్లీష్ మీడియం చదివిస్తుంటే.. పేద ప్రజలకు ఇంగ్లీష్ మీడియం అందకుండా కోర్టులకు వెళ్తున్నారు. ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు ప్రజల్ని దోచుకుతిన్నాడు. జగన్ రాజకీయాల్లో లేకపోతే ఇళ్లు లేక పేదలు అల్లాడుతుండేవారు. డిసెంబర్ 21 ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం రోజున గుడివాడలో టిడ్కో ఇళ్ళు పంపిణీ చేస్తాం. నియోజకవర్గంలో ఇళ్ళు లేవని ఒక్క పేదవాడు నన్ను అడిగినా 2024లో ఎన్నికల్లో పోటీ చేయను. నాలుగు లక్షల మంది వాలంటీర్లతో ప్రజలకు పాలన అందుబాటులోకి తెచ్చాం. గుడివాడలో ముఖ్య సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. కనీవినీ ఎరుగని విధంగా గుడివాడను అభివృద్ధి చేస్తాను. జగన్‌మోహన్ రెడ్డి జీవించి ఉన్నంత కాలం మనం ఆయనను ముఖ్యమంత్రిగా చూడాలి. అందుకోసం పేదలందరూ ఒకే వేదిక మీదకు రావాలని' ఎమ్మెల్యే కొడాలి నాని కోరారు. పని పాటాలేని చంద్రబాబు, పవన్ కల్యాణ్ చేస్తున్న ఆరోపణలను తిప్పి కొడతామని కొడాలి నాని అన్నారు. 'పవన్ చెప్పే తీరులో ఎటువంటి లాజిక్ లేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ఎటువంటి వ్యతిరేక ఓటు లేదు. మ్యానిఫెస్టోలో ప్రకటించిన ప్రతి ఒక్క దాన్ని అమలు చేసిన మాకు, మా ప్రభుత్వానికి అనుకూల ఓటు మాత్రమే ఉంది. ప్రజల ఇతర అవసరాలు తెలుసుకునేందుకే గడపగడపకు మన ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రి అమలు చేస్తున్నారు. పవన్ కళ్యాణ్, చంద్రబాబు కలిసి పోటీ చేసినా.. విడిగా పోటీచేసిన, మాకు ఊడేది ఏమీ లేదు. మిగిలిన ఇరవై నాలుగు సీట్ల కోసమే ప్రతిపక్షాలు పోరాడాలి. మా 151సీట్లు పక్కగా తిరిగి మాకు వస్తాయి' అని కొడాలి నాని అన్నారు.

# ఏదో విప్లవకారుడు అరెస్ట్ అయినట్లు బిల్డప్ ఏంటి.. చంద్రబాబుపై సజ్జల ఫైర్




టీడీపీపై ఏపీ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణా రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. పేపర్ లీకేజీ వ్యవహారంలో అరెస్టై, బెయిల్‌పై విడుదలైన నారాయణ వ్యవహారంపై టీడీపీ చేస్తున్న ప్రచారాన్ని ఆయన తప్పుబట్టారు. నారాయణ విషయంలో కక్షసాధింపులకు దిగుతున్నామంటూ తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆక్షేపించారు. ఓ విప్లవకారుడు అరెస్టైనట్లు చంద్రబాబు హడావుడి చేస్తున్నారంటూ తీవ్రంగా దుయ్యబట్టారు. మాల్ ప్రాక్టీస్ గానీ, పేపర్ లీకేజీ తప్పే కాదని టీడీపీ నేరుగా చెప్పగలదా? అంటూ సజ్జల సూటిగా ప్రశ్నించారు. మాల్ ప్రాక్టీస్‌కు ఎగబడి, మళ్లీ తమపైనే ఎదురుదాడి చేస్తున్నారంటూ తీవ్రంగా మండిపడ్డారు. ఈ విషయంలో ఎవరు తప్పు చేసినా, వారిని వదిలేది లేదని సజ్జల స్పష్టం చేశారు. పదో తరగతి పేపర్ లీకేజీ విషయంలో ప్రభుత్వం సరిగ్గా వ్యవహరించడం లేదని టీడీపీ ఆరోపణలు చేసిందని, తాము చర్యలు తీసుకుంటే మాత్రం నానా హంగామా చేస్తోందని అసహనం వ్యక్తం చేశారు. 100 శాతం ఉత్తీర్ణత కోసమే కొన్ని సంస్థలు మాల్ ప్రాక్టీసింగ్, పేపర్ లీకేజీ వంటి అక్రమాలు చేస్తున్నారని, ఇందులో భాగంగానే నారాయణ అరెస్ట్ అయ్యారని సజ్జల వివరించారు. పేపర్ లీకేజ్, మాల్ ప్రాక్టీస్ లాంటి ఘటనలు గత ప్రభుత్వ హయాంలోనూ జరిగాయని, అయితే ఆ ప్రభుత్వాలు వాటిని సీరియస్‌గా తీసుకోలేదన్నారు. కానీ.. ఈ విషయం తమ దృష్టికి రాగానే పిల్లల భవిష్యత్ దృష్ట్యా సీరియస్ అయ్యామని సజ్జల అన్నారు. పేపర్ లీక్‌తో సహా పలు దారుణాలకు పాల్పడ్డ వారి విషయంలో టీడీపీ విధానమేమిటో బట్టబయలు చేయాలని సజ్జల డిమాండ్ చేశారు. పేపర్ లీకుల విషయంలో తమను నారాయణే గైడ్ చేసేవారని డీన్ బాలగంగాధర్ తన వాంగ్మూలంలో పేర్కొన్నారని, నారాయణ మాత్రం తాను చైర్మన్ కాదంటూ సాంకేతిక కారణాలు చూపిస్తూ తప్పించుకుంటున్నారని అన్నారు.

# సీఎం వైఎస్ జగన్ సమక్షంలో పార్టీలో చేరిన టీడీపీ, జనసేన నేతలు



అమరావతి: గుంటూరు జిల్లాలోని పొన్నూరులో టీడీపీ, జనసేన పార్టీలకు ఊహించిన షాక్ తగిలింది. రెండు పార్టీలకు చెందిన నేతలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో బుధవారం వారు పార్టీ కండువా కప్పుకున్నారు. పార్టీలో చేరిన వారిలో గుంటూరు జిల్లా జనసేన మాజీ అధ్యక్షుడు మాదా రాధాకృష్ణమూర్తి, గుంటూరు జిల్లా టీడీపీ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు సయ్యద్ సుభాని, మాజీ ఎంపీపీ కొండా శివనాగిరెడ్డి, పొన్నూరు మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎం.షాలిని ఉన్నారు. ఇక, ఈ కార్యక్రమంలో పొన్నూరు ఎమ్మెల్యే కిలారి రోశయ్య కూడా పాల్గొన్నారు.

# కేరళలో 80 మంది చిన్నారులకు టమోటా ఫీవర్



కొచి: కేరళలో 80 మంది చిన్నారులకు టమోటా ఫీవర్ సోకింది. దీంతో ఆ రాష్ట్రంలో భయాందోళనలు మొదలయ్యాయి. అయిదేళ్ల లోపు చిన్నారులకు ఈ వ్యాధి సోకుతోంది.

టమోటా ఫీవర్ వ్యాప్తిపై తమిళనాడులోనూ ఆందోళన నెలకొన్నది. దీంతో సరిహద్దు జిల్లాల్లో పరీక్షలు చేపడుతున్నారు. కోయంబత్తూర్‌లో ఎంట్రీ అవుతున్నవారికి ఫీవర్ పరీక్షలు చేస్తున్నారు. తమిళనాడు, కేరళ బోర్డర్ వద్ద ఫ్లూ లక్షణాలు ఉన్నవారి కోసం గుర్తింపు జరుగుతోంది. వాహనాల్లో వెళ్తున్న చిన్న పిల్లలకు ఇద్దరు మెడికల్ ఆఫీసర్లు పరీక్షలు చేస్తున్నారు. చిన్నారుల్లో గుర్తు తెలియని జ్వరం వస్తోందని, అది టమోటా ఫీవర్ అని, అయితే అది వైరల్ అవుతుందా లేదా అని అధికారులు పరిశీలిస్తున్నారు. టమోటా ఫీవర్ సోకిన చిన్నారుల్లో దద్దులు, దురద, డీహైడ్రేషన్ వంటి లక్షణాలు ఏర్పడుతున్నాయి.

# తీవ్ర తుఫాన్ నుంచి తుఫాన్‌గా బలహీనపడ్డ 'అసాని'



విశాఖ: తీవ్ర తుఫాన్ నుంచి తుఫాన్‌గా 'అసాని' బలహీనపడింది. ప్రస్తుతం మచిలీపట్నంకు 40 కిలోమీటర్ల, కాకినాడకు 130 కిలోమీటర్ల, విశాఖ 272 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమైంది. గురువారం ఉదయం వాయుగుండంగా తుఫాన్ బలహీనపడనుంది. కొన్ని గంటల్లో వాయువ్య దిశగా పయనించి.. ఏపీ తీరం సమీపంలో పశ్చిమ మధ్య బంగాళాఖాతం చేరుకునే అవకాశం ఉంది. నేడు కోస్తాంధ్ర వ్యాప్తంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, అక్కడక్కడ భారీ నుంచి అతిభారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. కోస్తాంధ్ర తీరం వెంబడి గంటకు 50-60 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీస్తాయని అధికారులు తెలిపారు.

# ఏపీ మంత్రులకు నిరసన సెగలు..

## డిమాండ్లు తీర్చాలని ప్రజల బెట్టు

ఏపీ మంత్రులకు ప్రజల నుంచి నిరసన సెగ తగిలింది. గడప గడపకూ మన ప్రభుత్వం పేర నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా మంత్రులు ఆయా నియోజకవర్గాల్లో పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగానే మంత్రి గుమ్మనూరు జయరాం, బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, ఎంపీ మాధవ్‌కు ప్రజల నుంచి నిరసన వ్యక్తమైంది. మంత్రి గుమ్మనూరు జయరాం కర్నూలు జిల్లాలోని హత్తిబెళగల్‌లోని ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా తమకు రోడ్డు వేయించాలని ప్రజలు ఒక్కసారిగా డిమాండ్ చేశారు. ఆలూరు-హత్తినబెళల్ ప్రధాన రహదారిని ఎప్పుడు నిర్మిస్తారో చెప్పాలని మంత్రిని నిలదీశారు. అమ్మ ఒడి డబ్బులు కూడా రావడం లేదని, అమ్మ ఒడి రాకపోయినా పర్లేదని, రోడ్డు మాత్రం వేయించాలని మంత్రిని డిమాండ్ చేశారు. అదే విధంగా మంచి నీటి సమస్యను కూడా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇక మరో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డికి



కూడా ఇదే అనుభవం ఎదురైంది. తమకు రెండు నెలలుగా ఉపాధి హామీ పనుల డబ్బులు రావడం లేదని బేతంచెర్ల మండలంలో ప్రజలు నిలదీశారు. వెంటనే తమ డబ్బులు వచ్చేలా చూడాలని ప్రజలు డిమాండ్ చేశారు. దీంతో మంత్రి అధికారులను వెంటనే పిలిపించి, వివరణ కోరారు. వారం రోజుల్లోగా డబ్బులు వస్తాయని చెప్పి, వెళ్లిపోయారు.

# సంపాదకీయం

గురువారం 12-05-2022

## కాలం చెల్లిన చట్టాలు ఇంకెన్నాళ్లు

దేశద్రోహం కేసుల్లో కేంద్రం తన వైఖరిని 24 గంటల్లో చెప్పాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. దేశద్రోహ చట్టం అమలును ఆపుతారా లేదా అన్న అంశంతోపాటు దీని కింద ఆరోపణలు ఎదుర్కొంటున్నవారిని కాపాడతారా అన్న అంశంపై రేపటికల్లా సమాధానం చెప్పాలని కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ కేసు విచారణలో భాగంగా దేశద్రోహ చట్టాన్ని మూడు నాలుగు నెలల్లో పునఃసమీక్షించాలని కేంద్రానికి సుప్రీంకోర్టు సూచించింది. అప్పటిదాకా 124ం సెక్షన్ కింద కేసులు, వాటి దర్యాప్తును నిలుపుదల చేయాలని రాష్ట్రాలకు కేంద్రం ఎందుకు ఆదేశించడం లేదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి రమణ సారథ్యంలోని ధర్మాసనం ప్రశ్నించింది. దేశద్రోహ చట్టం చెల్లుబాటుపై మంగళవారం విచారణ జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ మాట్లాడుతూ.. ఈ అంశాన్ని ప్రభుత్వం అత్యున్నత స్థాయిలో పరిశీలిస్తోందన్నారు. ఇప్పుడు చట్టం చెల్లుబాటును వినవద్దు. మరోవైపు, కపిల్ సిబల్ వినికిడిని ఆపడానికి ఇది కారణం కాదని అన్నారు. పార్లమెంటులో కొత్త చట్టం పెండింగ్‌లో లేదు. పాత చట్టాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందని తెలిపారు. దీనిపై సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ మాట్లాడుతూ.. ఈ వ్యవహారంపై నోటీసులు జారీ చేశామన్నారు. ఇప్పుడు ప్రభుత్వం పరిశీలిస్తోంది. దీనికి ఎంత సమయం పడుతుంది? దీనిపై సొలిసిటర్ జనరల్ స్పందిస్తూ.. ఈ చట్టం 100 ఏళ్లకు పైగా అమల్లో ఉందని చెప్పారు. మేం చెప్పినది కోర్టు పరిగణనలోకి తీసుకుంటే రాజ్యాంగ ధర్మాసనం వినాలి. కానీ ఇప్పుడు విచారణ జరపవద్దని మేము కోరుతున్నాము. అన్నది ఇప్పుడే చెప్పలేను. ఇందుకు సంబంధించి వర్క్ సీరియస్ గా సాగుతుందని తెలిపారు. రాజద్రోహం చట్టాన్ని పునఃపరిశీలిస్తామని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు ధర్మాసనానికి తెలియజేసింది. ఈ నేపథ్యంలో 160 సంవత్స రాలకు పైగా చర్చ జరుగుతున్న ఈ చట్టం అమలు తీరు, దాని పర్యవసానాలపై పౌర సమాజం ఆసక్తితో ఉంది. మనం 21వ శతాబ్దంలో ఉన్నాం. ప్రపంచంలో అతి పెద్ద లిఖిత రాజ్యాంగం వెలుగులో జీవిస్తున్న సమాజం మనది. మానవ సమాజ పరిణామ క్రమంలో మనుషులకు అవసరం లేనివి కాలగర్భంలో కలిసిపోతాయి. ఆ విధంగానే నల్ల చట్టాలు కూడా మిగలొద్దని అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ లాంటి ఎన్నో దేశాలు వాటిని రద్దు చేసుకున్నాయి. మరి మనది 75 ఏళ్ల స్వతంత్ర భారతదేశం. రాజుల కాలం పోయింది. సంస్థానాలు కూలిపోయి నాయి. కానీ రాజులేని కాలంలో రాజద్రోహ చట్టాన్ని ఇంకా కాపాడుతున్నది ఎవరనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. ఈ రాజకీయ వాతావరణం ప్రజాస్వామ్య దేశంలో ఒక అవమానకరమైన పరిస్థితిని సూచిస్తుంది. అందుకేనేమో తెలుగు తేజం జస్టిస్ ఎన్వీ రమణ భారత ప్రధాన న్యాయ మూర్తిగా బాధ్యతలు స్వీకరించిన కొద్దికాలానికే రాజద్రోహానికి కాలం చెల్లిందని వ్యాఖ్యానించారు. భారత స్వతంత్ర ఆకాంక్షను అణచివేయడానికి బ్రిటిష్ వారు 1860లో ఇండియన్ పీనల్ కోడ్‌లో రాజద్రోహాన్ని పొందుపరిచారు. మహాత్మాగాంధీ, బాలగంగాధర తిలక్, జవహర్ లాల్ నెహ్రూ, మౌలానా అబుల్ కలాం ఆజాద్ లాంటి స్వతంత్ర సమరయోధులు రాజద్రోహం కింద ఆనాడు శిక్ష అనుభవించారు. స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం, లౌకికవాదం, ప్రజాస్వామ్యం గురించి ఉద్యమిస్తున్న వారిని ఈనాడు అదే చట్టం కింద నిర్బంధించడం సిగ్గుచేటు. ఎన్సీపీ అధ్యక్షులు శరద్ పవార్ ఈ చట్టం ఎత్తివేతకు అన్ని పార్టీలతో కార్యాచరణను ఆహ్వానిస్తున్నారు. కాంగ్రెస్ కూడా ఇందులో కలిసి రావాలని రాహుల్ గాంధీ హైదరాబాద్ వచ్చిన సందర్భంగా మాతో జరిగిన చర్చల్లో ప్రతిపాదించడం జరిగింది. మావోయిస్టులే చర్చలకు సిద్ధమ వుతున్నప్పుడు ఈ చట్టం మరింత కాలం చెల్లినది అని చెప్పక తప్పదు. చట్టం దుర్వినియోగం అయ్యే అవకాశం ఉందని, ఈనాటి ప్రమాదాన్ని ముందే ఊహించిన కె.ఎం. మున్షీ లాంటివారు దీన్ని అత్యంత క్రూరమైన చట్టంగా అభివర్ణించారు. వ్యక్తి హక్కులను నిర్దాక్షిణ్యంగా అణిచివేసే ఈ చట్టం ప్రజా స్వామ్య మనుగడకు ప్రమాదకరమని రాజ్యాంగ సభలో మాట్లాడారు. ప్రతిపక్షం లేకుండా ప్రజాస్వామ్య మనుగడ ఉండదు. ప్రశ్న ప్రజాస్వామ్య ఉనికికి జీవగర్ర లాంటిది. పౌరులకు రాజ్యాంగం ఇచ్చిన ప్రాథమిక హక్కుల అణచివేతకు కారణమవుతున్న రాజద్రోహాన్ని భారత శిక్షా స్మృతి నుండి తొలగించాలని ఇప్పటికే అనేక కేసులు దాఖలయ్యాయి. ఈ ప్రయత్నంలో న్యాయవ్యవస్థ సఫలీకృతం అయితే భారత ప్రజలకు ఒక భరోసా లభించినట్లే. రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న రాజకీయ పార్టీలతో సహా అన్ని ప్రతిపక్ష పార్టీలు కూడా గొంతు విప్పవలసిన సమయం ఇది. ప్రజల చేత ప్రజల కొరకు ప్రజలే ఎన్నుకొనే ప్రజా ప్రభుత్వాలు ఏవైనా సరే ఈ సత్యం గ్రహించాలి. ప్రజాస్వామ్యం అంతిమసారం అదే. రాజ్యాంగ స్ఫూర్తి కూడా అదే

# గడపగడపకు వైసీపీ



ఏలూరు, మే 11, వైసీపీ నేతలు ఇంటింటికి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. మూడేళ్ల పాలనలో ఒక్కో ఇంటికి ఎంత ఇచ్చామో చెబుతూ పత్రాలు కూడా తీసుకుని బయలుదేరుతున్నారు. లబ్దిదారుల జాబితా అన్ని గ్రామ, వార్డు సచివాలయాల దగ్గర నుంచి వైసీపీ నేతలు తీసుకున్నారు. తాము వెళ్లే ప్రతీ కాలనీలో వారిని కలవడంతో పాటు.. కొత్తగా ఎవరికైనా పథకాలు కావాలమో రాసుకుంటారు. ఇంత కాలం ఎందుకు ఇవ్వలేదని వచ్చేప్రశ్నలకు సావధానంగా సమాధానం చెప్పి? సానుకూలత తెచ్చుకోవాలని వైసీపీ నేతలు భావిస్తున్నారు. ఇంకా ఎన్నికలకు రెండేళ్లు ఉంది. అయితే జగన్ మాత్రం ఇప్పట్నుంచే జనాల్లోకి పోవాలని నేతలను ఒత్తిడి చేస్తున్నారు. పార్టీ నేతలు ఈ మూడేళ్ల కాలంలో తాము ఏం చేశామో చెప్పుకోవడానికి అవకాశం లేకుండా పోయింది. ఎమ్మెల్యేల స్థాయిలో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు జరగలేదు. కింది స్థాయిలో ఉపాధి హామీ పనులతో ఆర్బీకేలు.. ఇతర పనులను చేపడితే వాటికి బిల్లులు రాలేదు. దీంతో గ్రామాల్లో క్యాడర్ మరో పైసా అయినా పార్టీ కోసం ఖర్చు పెట్టుకునే పరిస్థితి లేదు. మరో వైపు పన్నులు..పెరిగిపోయిన నిత్యవసర వస్తువుల ధరలు.. అధికార పార్టీగా వైసీపీ నేతలకు దడ పుట్టిస్తున్నాయి. ఏ చిన్నఘటన జరిగినా సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇటీవలి కాలంలో వ్యతిరేకత బాగా పెరిగిందనడానికి సోషల్ మీడియాలో కనిపిస్తున్న వ్యతిరేకతే కారణం అని భావిస్తున్నారు. మొత్తంగా చూస్తే వైసీపీ నేతలు ఎంత మేర జోరుగా ప్రజల్లోకి వెళ్తారో.. వారి వద్ద నుంచి ఎలాంటి రియాక్షన్ వస్తుందో వేచి చూడాల్సి ందే24 సీట్లపై గురి గత ఎన్నికల్లో ప్రభంజనం సృష్టించిన వైఎస్సార్‌సీపీ.. ఆంధ్రప్రదేశ్‌లో దాదాపుగా స్వీప్ చేసేసింది. కాకపోతే ఆ నియోజకవర్గాల్లో మాత్రం.. ఎందుకనో విక్టరీ కొట్టలేకపోయింది. అందుకే, ఇప్పుడో కొత్త టార్గెట్ పెట్టుకుంది. లాస్ట్ టైమ్ మిస్సయిన స్థానాల్ని కూడా చేజిక్కించుకునేలా కొత్త స్కెచ్ వేసింది. ఆంధ్రప్రదేశ్‌లో 2019 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రత్యర్థులు సైతం ఊహించని విజయంతో అధికారం దక్కించుకున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ? ఈసారి మరింత పదునైన వ్యూహాలతో ఎన్నిలకు సిద్ధమవుతోంది. ఓవైపు ప్రభుత్వ కార్యక్రమాలు చూస్తూనే? మరోవైపు పార్టీ పటిష్టతపైనా ఫోకస్ పెట్టిన సీఎం జగన్మోహన్‌రెడ్డి? సరికొత్త వ్యూహాలతో ప్రత్యర్థులకు సవాల్ విసిరేందుకు సిద్ధమవుతున్నారు. ఏపీలోని 175 స్థానాలకు గాను? గత ఎన్నికల్లో ఏకంగా 151 సీట్లు గెలిచిన వైసీపీ? ప్రత్యర్థులకు 24 స్థానాల్లో మాత్రమే ఛాన్సిచ్చింది. అందులో 23 టీడీపీ, ఒక స్థానం జనసేన గెలుచుకుంది. ఆ 24మంది ప్రతిపక్ష ఎమ్మెల్యేల్లోనూ కొందరు అధికార పార్టీకి మద్దతుగా మారిపోయారు, అది వేరే విషయం. అయితే, ఆ 24స్థానాలు ఎందుకు ఓడిపోయాం.. అవి కూడా గెలిచేస్తే ఓ పనైపోతుంది? అనే అంశంపై ఫోకస్ పెట్టింది వైసీపీ హైకమాండ్. ఈసారి ఆ స్థానాలు కూడా తమ ఖాతాలో వేసుకోవాలని కంకణం కట్టేసుకున్నట్టే కనిపిస్తోంది. 2019ఎన్నికల్లో దాదాపు స్వీప్ చేసింతగా దూసుకెళ్లిన వైసీపీ? ఆ 24 చోట్ల మాత్రం వెనకబడింది. అందుకే, ఓడిన 24 నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి పెట్టిన జగన్.. ఈసారి ఎలాగైనా గెలవాలనే పట్టుదలతో ఉన్నారు. గడపగడప కు వైస్సార్ కాంగ్రెస్ కార్యక్రమం సందర్భంగా? ఆ నియోజకవర్గాలకు ఇంచార్జల విషయంలోనూ అధిష్టానం క్లారిటీ ఇవ్వనుంది. వాటిలో కొన్ని నియోజకవర్గాలకు సంబంధించి బలమైన నేతలకు ఇంచార్జులుగా బాద్యతలు అప్పగించింది.

# కమలం ఫ్యూచరేంటీ...



విజయవాడ, మే 11, ఆంధ్రప్రదేశ్ లో పొత్తు పొడుపుతు ఖాయమని తేలిపోయింది. తెలుగుదేశం, జనసేన పార్టీల మధ్య వచ్చే ఎన్నికలలో అవగాహన తథ్యమని దాదాపు ఖరారైపోయింది. ఇరు పార్టీల అధినేతలూ ఈ విషయంలో ఎలాంటి కన్ఫ్యూజన్ కూ తావు లేకుండా ఒక క్లారిటీ ఇచ్చేశారు. రాష్ట్రంలో వైకాపాను ఓడించేందుకు అందరూ కలిసి రావాలన్న చంద్రబాబు పిలుపుకు జనసేనాని పవన్ కల్యాణ్ సానుకూలంగా స్పందించారు. దీంతో ఈ రెండు పార్టీల మధ్య పొత్తు ఉంటుందని దాదాపుగా ఖరారైంది. అయితే వీరితో పాటు బీజేపీ కలుస్తుందా లేదా అన్న విషయంలో మాత్రం ఇప్పటికీ క్లారిటీ రాలేదు. అయితే చంద్రబాబు కలిసిరావాలన్న పిలుపుపై ఒకింత చర్చ మాత్రం బీజేపీలో ప్రారంభమైనట్లే కనిపిస్తున్నది. చంద్రబాబు పిలుపుపై సోము వీర్రాజు స్పందన ఒకలా.. ఇతర నేతల స్పందన ఒకలా ఉంది. సోము వీర్రాజు చంద్రబాబు కలిసి రావాలని ఇచ్చిన పిలుపై స్పందించిన తీరుపై తెలుగుదేశం నాయకులు ఘాటు వ్యాఖ్యలు చేశారు. పొత్తులపై నిర్ణయం తీసుకునేది సోము వీర్రాజు కాదని చెబుతూ ఆయన స్థాయి ఏమిటన్నది తేల్చేసి చిన్నబుచ్చారు. రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులను గమనిస్తున్న వారు మాత్రం వచ్చే ఎన్నికలలో 2014 నాటి సీన్ రిపీట్ అయ్యే అవకాశాలే ఎక్కువ ఉన్నాయని భావిస్తున్నారు. అంటే తెలుగుదేశం, జనసేనలతో పాటు బీజేపీ కూడా కలిసి ఉంటుందని వారి ఉద్దేశం. పైగా ప్రస్తుతం జనసేన, బీజేపీల మధ్య పొత్తు ఉంది. అయితే జనసైనికులు మాత్రం బీజేపీతో పొత్తు పట్ల ఒకింత విముఖంగానే ఉన్నారు. ఆ పార్టీకి రాష్ట్రంలో ఉన్న బలం, పట్టును బట్టి బీజేపీతో పొత్తు వల్ల జనసేనకు ఒరిగేదేమీ లేకపోగా... ఆ పార్టీ భారాన్ని కూడా పవన్ కల్యాణే మోయాల్సి ఉంటుందని జనసైనికులు అంటున్నారు. దీనికి తోడు బీజేపీతో పొత్త వల్ల మైనారిటీలు పార్టీకి దూరమయ్యే పరిస్థితి కూడా ఉందని అంటున్నారు. దీనికి తోడు జనసేన ఊసెత్తకుండా, వచ్చే ఎన్నికలలో విజయం సాధించి రాష్ట్రంలో అధికారం చేపడతామంటూ బీజేపీ ఏపీ అధ్యక్షుడు సోము వీర్రాజు ప్రకటలను జనసైనికులు తప్పుపడుతున్నారు. పొత్తు జనసేనతోనూ.. కానీ చర్యలు మాత్రం రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసీపీకి అనుకూలంగాను సోము వీర్రాజు వ్యాఖ్యలు ఉన్నాయని వారు విమర్శిస్తున్నారు. అయితే సోము వీర్రాజు వ్యాఖ్యలపై జనసేనాని మాత్రం స్పందించలేదు. మొత్తం మీద రాష్ట్రంలో ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీలకుండా ఉండేందుకు సమైక్యంగా ఉండటం అవసరమన్న విషయంలో తెలుగుదేవం, జనసేప పార్టీలలో క్లారిటీ ఉంది. అయితే అటువంటి క్లారిటీ జాతీయ పార్టీ అయిన బీజేపీలో మాత్రం కానరావడం లేదు. రాష్ట్రంలో కనీసం ఒక్క శాతం ఓటు బ్యాంకు అయినా లేని బీజేపీ ఏ ధైర్యంతో, ఎవరి అండతో ఒంటరిగా అధికారం అన్న విశ్వాసాన్ని ప్రదర్శిస్తున్నదో అర్థం కాదు. అందుకే 2014 సీన్ రిపీట్ అయ్యే అంశంలో అంటే తెలుగుదేశం, జనసేన, బీజేపీల మధ్య పొత్తు విషయంలో స్పష్టత లేకపోయినా, కమలం పార్టీ కలిసినా కలవకున్నా జనసేన, తెలుగుదేశం పార్టీల మధ్య స్పష్టమైన ఎన్నికల అవగాహన కుదరడం మాత్రం ఖాయమని పరిశీలకులు అంటున్నారు

# సీఎం జగనన్నతోనే ప్రజల వద్దకే పాలన సాధ్యం

**- వైకాపా నేత గిరిధర్ రెడ్డి, మేయర్ స్రవంతి**

నెల్లూరు ప్రజల వద్దకే పరిపాలన దిశగా రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి పరిపాలన సాగుతుందని, ప్రజలందరికి సంక్షేమ పాలన అందించే దిశగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి అమలు చేస్తున్న విధానాలతో గడప గడపలో సంతోషాలు విరాజిల్లుతున్నాయని వై.సీ.పీ. రాష్ట్ర కార్యదర్శి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, మేయర్ స్రవంతిజయవర్ధన్ లు పేర్కొన్నారు. శ్రీధరన్న మాట ? గడప గడపకు మీ కార్పొరేటర్ బాట" కార్యక్రమాన్ని స్థానిక 23వ డివిజన్ పడారుపల్లి వికలాంగుల కాలనీ, సుందరయ్య నగర్ తదితర ప్రాంతాల్లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి మరియు నగర మేయర్ విజయవర్ధన్ స్థానిక ప్రజలతో మాట్లాడి వివిధ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని అర్హులైన ప్రతి ఒక్కరికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్నా అభివృద్ధి సంక్షేమ పథకాలు అందరికీ సక్రమంగా అందుతున్నాయా లేదా అనే విషయాన్ని స్వయంగా పరిశీలించారు .సంక్షేమ పథకాల అమలు తీరును, సచివాలయ కార్యదర్శులు, వాలంటీర్లు అందిస్తున్న సేవలను ప్రతి ఇంటికి తిరిగి విచారణ చేపట్టారు ."అసని" తుఫాను నేపథ్యంలో భాగంగా ఎడతెరిపిలేని వర్షాలు కురుస్తున్నప్పటికీ స్థానిక కార్పొరేటర్ దుద్దుగుంట శ్రీనివాస్ రెడ్డితో కలిసి గడప గడపకు పర్యటనలో హుషారుగా ముందుకెళ్లారు. స్థానిక డివిజన్ వై.సి.పీ నేతలు మరియు కార్యకర్తలతో కలిసి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, స్రవంతిజయవర్ధన్ లు డివిజన్ పరిధి లోని వివిధ ప్రాంతాలను సందర్శించారు. గ్రామీణ నియోజకవర్గం అభివృద్ధి సంక్షేమానికి స్థానిక శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి చేస్తున్న నిరంతర సేవా కార్యక్రమాల గురించి వివరించారు .ఈ కార్యక్రమంలో స్థానిక 23వ డివిజన్ కార్పొరేటర్ దుద్దుగుంట శ్రీనివాసులు రెడ్డి, డివిజన్ ఇంచార్జ్ పాతపాటి ప్రభాకర్ రెడ్డి, వై.సి.పీ నాయకులు మరియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అసని తుఫాను కారణంగా జిల్లా పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉండాలి

**జిల్లా యస్.పి. విజయ రావు**

నెల్లూరు తుఫాన్ నేపథ్యంలో జిల్లా పోలీసు యంత్రాంగం ప్రజలకు అన్ని విధాల సహాయక చర్యలు చేయుటకు సిద్ధంగా ఉండాలని, ముమ్మరంగా విజబుల్ పోలీసింగ్ చేయాలని జిల్లా ఎస్పీ విజయా రావు ఆదేశించారు. రెవెన్యూ, మున్సిపల్/గ్రామ పంచాయతీ అధికారుల సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టాలి. ప్రజల సహాయార్థం, సహాయక చర్యల కోసం పోలీసు సిబ్బంది 24ీ7 అందుబాటులో ఉండాలి. నదులు, వాగులు, వంకలు, చెరువులు, జలాశయాలు మరియు లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు సురక్షిత ప్రాంతాల్లో సురక్షితంగా ఉండేలా రెవిన్యూ అధికారుల సహాయంతో చర్యలు చేపట్టాలి. బలమైన గాలులు వీస్తున్నాయి కాబట్టి ముఖ్యంగా చెట్లు, విధ్యుత్ స్థంబాలు మరియు రేకుల షెడ్ లు ఎగిరి ప్రజలకు, ప్రజా రవాణా వ్యవస్థకు ఇబ్బంది కలగకుండా చూడాలి. రోడ్లపై విరిగిన చెట్లను వెంటనే తొలగించేలా చర్యలు చేపట్టాలి. జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్ లో తుఫాన్ సహాయక చర్యల కొరకు పోలీసు, ఎస్డీఆర్ఎఫ్ ప్రత్యేక బృందాలను సిద్ధంగా ఉండి సహాయక చర్యలు చేపడుతున్నాయి. తుఫాన్ వలన ఏమైనా ఘటనలు తలెత్తినా, అత్యవసర పరిస్థితి వచ్చినా, సమస్యలకు గురైనా ప్రజలు, వెంటనే డయల్ - 100 లేదా పోలీసు కంట్రోల్ రూమ్ వాట్స్ యాప్ నంబర్ +91 9392903413 కు సమాచారం తెలిపితే సహాయ చర్యలు చేయడానికి నెల్లూరు జిల్లా పోలీస్ యంత్రాంగం 24ీ7 అందుబాటులో వుంటుందని అయన తెలిపారు.

## ఆలయాల్లో హస్త లాఘవం

తిరుమల మే 11, కలియుగ వైకుంఠం తిరుమల శ్రీవారి ఆలయంలో చోరీ ఘటన కలకలం రేపింది. ఆలయ పరకామణిలో ఓ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి చేతివాటం ప్రదర్శించాడు. కరెన్సీ లెక్కింపు మండపంలో నగదును చోరీ చేశాడు. స్వదేశీ కరెన్సీతో పాటు విదేశీ కరెన్సీని కూడా సదరు వ్యక్తి చోరీ చేసినట్లు తెలుస్తోంది. గత కొన్ని నెలలుగా అతడు చోరీకి పాల్పడుతున్నట్టుగా అధికారులు గుర్తించారు. అయితే నిందితుడి చేతివాటం గురించి అతడి సహోద్యోగి ఫిర్యాదు చేయడంతో అసలు విషయం వెలుగు చూసింది. ఈ ఘటనపై ఆలయ విజిలెన్స్ అధికారులు అప్రమత్తమయ్యారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. భద్రత కట్టుదిట్టంగా ఉండే పరకామణిలో చోరీ జరగడం ప్రస్తుతం హాట్ టాపిక్ గా మారింది. ఈ విషయాన్ని గొప్యంగా ఉంచి.. టీటీడీ విజిలెన్స్ బృందం దర్యాప్తు చేస్తోంది. ఈ ఘటనపై మరింత సమాచారం తెలియాల్సి ఉంది. మరోవైపు.. ఇంద్రకీలాద్రి దుర్గమ్మ ఆలయ హుండీల లెక్కింపులో సిబ్బంది చేతివాటం ప్రదర్శించారు. నిన్న మహామండపం ఆరో అంతస్థులో అమ్మవారి హుండీల్లోని కానుకల లెక్కింపు కార్యక్రమం జరిగింది. ఈ సమయంలో బంగారు ఆభరణాలను అపహరించేందుకు సిబ్బంది ప్రయత్నించారు. ఎస్పీఎఫ్ తనిఖీల్లో నల్లపూసల చైన్, ఒక ఉంగరం, రెండు గిల్టు ఉంగరాలు, బుట్ట దుద్దులు బయటపడ్డాయి. మహామండపం వద్ద ఉన్న వాష్ రూమ్ లో బంగారాన్ని పోలీసులు గుర్తించారు. అపహరించేందుకు యత్నించిన బంగారం విలువ సుమారు 5 గ్రాములు ఉంటుందని అధికారులు తేల్చారు. వీటి విలువ రూ.16 వేలు ఉంటుందని అంచనా వేశారు.

## ఈ నామ్ లో మనమే ముందు

కర్నూలు, మే 11, ఈ?నామ్ (ఎలక్ట్రానిక్ నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్).. రైతులకు గిట్టుబాటు ధర, వ్యాపారులకు నాణ్యమైన సరుకు అందించే లక్ష్యంతో దేశవ్యాప్తంగా ఉన్న వ్యవసాయ మార్కెట్ యార్డులను ఏకతాటిపైకి తీసుకొచ్చిన వేదిక. జాతీయస్థాయిలో వ్యాపారపరంగా గుంటూరు మార్కెట్ కమిటీ మొదటి స్థానంలో నిలవగా, ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఐదోస్థానంలో ఉంది. వేలంలో ఎక్కువమంది వ్యాపారులు పాల్గొన్నవాటిలో ఆదోని మార్కెట్ మొదటిస్థానంలో నిలిచింది. ప్రభుత్వ ప్రోత్సాహం, మౌలిక వసతుల కల్పన ఫలితంగా ఏపీతో పాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రైతులు, జాతీయస్థాయిలో వ్యాపారులు ఏపీ మార్కెట్ల ద్వారా క్రయవిక్రయాలకు పోటీ పడుతున్నారు. ఈ?నామ్ పరిధిలో జాతీయస్థాయిలో వెయ్యి మార్కెట్లు ఉండగా, రాష్ట్రంలో 33 మార్కెట్లు నమోదయ్యాయి. రాష్ట్రంలో 14.43 లక్షల మంది రైతులు, 3,469 మంది వ్యాపారులు, 2,285 మంది కమీషన్ ఏజెంట్లు ఈ?నామ్‌లో నమోదు చేసుకున్నారు. 194 రైతు ఉత్పత్తిదారుల సంఘాలు కూడా రిజిస్ట్రేషన్ చేసుకున్నాయి. ఇప్పటివరకు రికార్డు స్థాయిలో రూ.29,701 కోట్ల విలువైన 51.73 లక్షల టన్నుల ఉత్పత్తుల క్రయవిక్రయాలు జరిగాయి. ప్రధానంగా మిరప, పత్తి, పసుపు, నిమ్మ, టమాట, బెల్లం, ఆముదం, ఉల్లి, వివిధ రకాల పండ్లు, కూరగాయల క్రయవిక్రయాలు జరుగుతున్నాయిఈ?నామ్‌లో నమోదు చేసుకున్న రైతులు, వ్యాపారులు నేరుగా లేదా ఆన్‌లైన్‌లో దేశంలో ఎక్కడి నుంచైనా క్రయవిక్రయాలు చేయవచ్చు. అమ్మిన రోజునే రైతు ఖాతాకు సొమ్ము జమ అవుతుంది. ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్ల వల్ల తూకాల్లో మోసాలకు తావుండదు. తొలుత మార్కెట్‌కు రైతు తెచి?చన సరుకు వివరాలను నమోదు చేసుకుని, ఆ రైతు ఎంచుకున్న కమీషన్ ఏజెంట్ వద్దకు పంపిస్తారు. నాణ్యత పరీక్షా యంత్రాల (ఎస్సైయింగ్ ల్యాబ్స్) ద్వారా ర్యాండమ్‌గా లాట్స్ నాణ్యతను పరీక్షించి ఆన్‌లైన్‌లోనే పరిమాణంతో సహా ప్రదర్శిస్తారు. రహస్య బిడ్డింగ్ ద్వారా వ్యాపారులు కోట్‌చేసిన ధరల్లో అత్యధిక ధర, వ్యాపారి వివరాలను రైతుకు పంపిస్తారు. రైతు ఆ ధర నచ్చితే అమ్ముకోవచ్చు. లేదంటే తిరస్కరించవచ్చు. ఈ?నామ్ ద్వారా ఇప్పటివరకు జరిగిన వ్యాపారంలో రూ.20,985 కోట్ల విలువైన 26.45 లక్షల టన్నుల ఉత్పత్తుల క్రయవిక్రయాలు గుంటూరు మార్కెట్ యార్డు పరిధిలోనే జరిగాయి. ఈ మార్కెట్‌కు వచ్చే మిర్చి కొనుగోలుకు పొరుగు రాష్ట్రాల వ్యాపారులు పోటీపడుతుంటారు. అత్యధిక మంది వ్యాపారులు పోటీపడుతున్న మార్కెట్‌గా ఆదోని మార్కెట్ మొదటి స్థానంలో నిలిచింది. ఇక్కడ సగటున ఒక్కో లాట్‌కు 10?15 మంది పోటీ పడుతుండగా, సీజన్‌లో అత్యధికంగా 30?40 మంది కూడా పోటీపడిన సందర్భాలున్నాయి. ఇక్కడ ఇప్పటివరకు 9.36 లక్షల లాట్స్ కోసం 87.90 లక్షల బిడ్స్ దాఖలయ్యాయి. రూ.3,149 కోట్ల విలువైన 6.16 లక్షల టన్నుల క్రయవిక్రయాలతో ఆదోని వ్యాపారులు జోష్ గా సాగుతున్నారు

## అమ్మో..'పార్థీ గ్యాంగ్'..

అనంతపురం, మే 11,పార్థీ గ్యాంగ్.. ఈ పేరు వింటేనే సామాన్యులకు హడల్. వీరి కన్ను పడితే ఎలాంటి భద్రత ఉన్నా ఇళ్లయినా లూటీ కావాల్సిందే. చోరీలు ఈ గ్యాంగ్‌కు వెన్నతో పెట్టిన విద్య. తప్పించుకోవడంలోనూ వీరు ఆరితేరిపోయారు. దురదృష్టం వెంటాడి పోలీసులకు చిక్కినా ఇసుమంతైనా సమాచారం ఇవ్వరు. చోరీ సమయంలో అత్యంత క్రూరంగా వ్యవహరించే ఈ గ్యాంగ్ కదలికలు రాయలసీమలో కనిపిస్తున్నాయి. ప్రధానంగా అనంతపురం జిల్లాలో ఎక్కువగా సంచరిస్తున్నట్టు సమాచారం అందింది. తాజాగా గుంతకల్లు దగ్గర జరిగిన రైలు దోపిడీలోనూ వీరి పాత్ర ఉన్నట్టు అనుమానిస్తున్నారు. మహారాష్ట్రలోని చత్రీ, పర్భాని, నాసిక్, ఇంజన్‌ఘాట్, గుల్బర్గా, బాంబే, ఔరంగాబాద్, మధ్యప్రదేశ్‌లోని పాసే పార్థీ తెగకు చెందిన వారు. బతుకుదెరువు కోసం వలస వచ్చి స్థానికంగా ఫ్లైఓవర్ బ్రిడ్జిలు, రైల్వే స్టేషన్, బస్టాండ్‌ల వద్ద గుడారాలు వేసుకుంటారు. అదును చూసి చోరీలకు తెగబడతారు. ప్రధానంగా నగర శివారు ప్రాంతాలపైనే వీరి కన్ను. వ్యాపారుల అవతారమెత్తి రెక్కీ నిర్వహించి మరీ దోపిడీలు, దొంగతనాలకు పాల్పడతారు. అనంతపురం, రాయదుర్గం, గుంతకల్లు, గుత్తి, కదిరి, హిందూపురం ప్రాంతాలతో పాటు కర్నూలు, చిత్తూరులోని కొన్ని ప్రాంతాలలో పూసలు, దుప్పట్లు, గృహాలంకరణకు వినియోగించే మట్టి బొమ్మలు అమ్మే వ్యాపారుల్లా పార్థీ గ్యాంగ్ సభ్యులు అవతారమెత్తుతారు. తాళం వేసిన ఇళ్లను టార్గెట్‌గా చేసుకుని చోరీలకు పాల్పడతారు. అడ్డొస్తే ప్రాణాలను సైతం తీస్తారు. ఇంత క్రూపమైన పార్థీ గ్యాంగ్‌కు ఓ మహిళ డాన్‌గా వ్యవహరిస్తుండటం విశేషం. తాజాగా అనంతపురం జిల్లా కేంద్రంలో పార్థీ గ్యాంగ్‌కు సంబంధించిన ఓ ముఠా సభ్యులు పట్టుబడటం చర్చనీయాంశమైంది. ఈ పార్థీ గ్యాంగ్ ఎక్కడ చోరీలకు పాల్పడినా చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తుంది. ఎక్కడా వారి ఆనవాళు లేకుండా చూసుకుంటుంది. సెల్‌ఫోన్లను సైతం నేర ప్రాంతానికి సుమారు 30 కిలో మీటర్ల దూరంలోనే స్విచ్ ఆఫ్ చేస్తారు. ఈ గ్యాంగ్‌లు ఎక్కడ దోపిడీకి పాల్పడినా వారి గ్రామాలకు చేరుకోకముందే పోలీసులు పట్టుకోవాలి. లేదంటే దోచుకున్న సొత్తులో పైసా కూడా రికవరీ చేయలేరు. కారణం దోచుకున్న సొమ్ములో 30 శాతం ఆదాయాన్ని గ్రామాల అభివృద్ధి కోసం పెద్దలకు ఇస్తారు.

## ఆన్ లైన్ లో ఖనిజాల వేలం

గుంటూరు, మే 11, రాష్ట్రంలోని చిన్నతరహా ఖనిజాల లీజులకు ఆన్‌లైన్ వేలం జరగనుంది. ఈ?ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్ ద్వారా గనుల శాఖ వేలం ప్రక్రియ నిర్వహించనుంది. తొలివిడతగా ఈ నెలలో 200 లీజులకు ఈ?వేలం నిర్వహించి అనుమతులు మంజూరు చేయడానికి ఏర్పాట్లు చేశారు. గనుల రంగంలో ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణల్లో భాగంగా చిన్నతరహా ఖనిజాలకు ఈ?వేలం ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఆసక్తి గల వ్యక్తులు, సంస్థలు ఎవరైనా ఈ?వేలంలో పాల్గొనేందుకు వీలుగా గనుల శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ?వేలం నిర్వహించే లీజుల వివరాలు, అవసరమైన టెండర్ పత్రాలు ఈ నెల 12వ తేదీ నుంచి ఈ?ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్ అందుబాటులో ఉంచుతారు. లీజులకు సంబంధించిన పూర్తి వివరాలను లద్వారా తెలుసుకోవచ్చు. ఈ?వేలంలో ఎక్కువ మొత్తానికి బిడ్ కోట్ చేస్తారో ఆ బిడ్డర్ (ప్రిఫర్డ్ బిడ్డర్) తాను కోట్ చేసిన మొత్తాన్ని 15 రోజుల్లో గనుల శాఖకు చెల్లించాల్సి ఉంటుంది. ఈ సొమ్ము చెల్లించిన వెంటనే వారికి లెటర్ ఆఫ్ ఇంటెంట్ జారీ చేస్తారు. ఆ తర్వాత బిడ్డర్ తాను కోట్ చేసిన క్వారీకి సంబంధించిన మైనింగ్ ప్లాన్, పర్యావరణ అనుమతి, సీఎఫ్ఈ సమర్పించిన వెంటనే లీజులు మంజూరు చేస్తారు. తొలివిడతలో 200 లీజులకు ఈ?వేలం ద్వారా అనుమతులు మంజూరు చేస్తాం. ఎక్కడా అనవసర జాప్యం లేకుండా, పారదర్శకంగా లీజుల జారీ ప్రక్రియ ఉంటుంది. ఇప్పటివరకు మైనింగ్ రంగంలోకి రావాలనే ఆసక్తి ఉండి, అవకాశాలు దక్కని వారు ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన ఈ విధానం ద్వారా మైనింగ్ రంగంలోకి ప్రవేశించేందుకు అవకాశం ఏర్పడుతుంది.

## కేజీహెచ్ లో మోడరన్ మార్చురీ

విశాఖపట్టణం, మే 11, కేజీహెచ్ మోడ్రన్ మార్చురీ అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం ఉన్న మార్చురీని ఆధునికీకరిస్తున్నారు. పోస్ట్‌మార్టం కోసం వచ్చే వారి మృతుల బంధువుల కోసం ప్రత్యేకంగా ఓ షెడ్ నిర్మాణం చేపట్టారు. అనంతరం ఏసీలు ఏర్పాటు చేయనున్నారు. మోడ్రన్ మార్చురీ అభివృద్ధికి కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున రూ.50 లక్షలు మంజూరు చేసిన విషయం పాఠకులకు విధితమే. ఆంధ్రా మెడికల్ కళాశాలకు అనుసంధానంగా ఉన్న మోడ్రన్ మార్చురీ ఆధునికీకరణపై ఏఎంసీ ప్రిన్సిపాల్ సాంబశివరావు, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.మైథిలి, ఏపీఎంఎస్ఐడీసీ అధికారులతో గత నెల 28న కలెక్టర్ చర్చించిన విషయం తెలిసిందే. కేజీహెచ్‌కు, ఆంధ్రా మెడికల్ కళాశాలకు అనుబంధంగా మార్చురీ ఉంది. ప్రమాదవశాత్తు జరిగిన సంఘటనలు, ఆత్మహత్యలు, రోడ్డు ప్రమాదాలు, బీచ్‌లో గల్లంతు, రైలు ప్రమాదాల్లో మృతులకు పోస్టుమార్టం కోసం కేజీహెచ్‌కు తీసుకు వస్తుంటారు. మృతదేహాలతో పాటు వారి బంధువులు ఇక్కడికి వస్తుంటారు. చనిపోయిన వ్యక్తి కుటుంబ సభ్యులు..మరో వైపు శవ పంచనామా చేసేందుకు పోలీసులు..తరచూ కేజీహెచ్ మార్చురీకి వస్తుంటారు. పోస్ట్‌మార్టం పూర్తయ్యే వరకు వీరంతా మండుటెండల్లోనో, జోరువానలోనో నిరీక్షించాల్సిన దుస్థితి గతంలో ఉండేది. కేజీహెచ్ మార్చురీ ఆధునికీకరణకు కలెక్టర్ మల్లికార్జున ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. మార్చురీ అభివృద్ధికి సంబంధిత అధికారులతో ఇప్పటికే చర్చలు జరిపారు. తక్షణమే పనులు చేపట్టాలని గత నెలలోనే ఆదేశించారు. ముఖ్యంగా చనిపోయిన వ్యక్తి పోస్ట్ మార్టం కోసం వచ్చే బంధువులు, పోలీసులు ఎటువంటి ఇబ్బంది ఎదుర్కోకుండా, మండుటెండల్లో నిరీక్షించకుండా ఉండేందుకు వీలుగా ప్రత్యేక షెడ్డు వేసి, అందులో ఏసీల ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ చర్యలు యుద్ధప్రాతిపదికన చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించడమే గాక ఈ పనుల కోసం రూ.50 లక్షలు మంజూరు చేశారు. కొద్ది రోజుల్లో ఈ పనులు పూర్తి కానున్నాయని, త్వరలోనే అందుబాటులోకి తేనున్నట్టు ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి.

## మన్యంలో తూఫాన్ ప్రభావం

పార్వతీపురం మన్యం జిల్లా వ్యాప్తంగా బుధవారం ఉదయం నుండి భారీ వర్షం కురిసింది. దాంతో ప్రజలు ఇళ్లకే పరిమితమైయారు. ఈరోజు జరగాల్సిన ఇంటర్ పరీక్ష రద్దు చేయడంతో విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు. పలు చోట్ల రోడ్లు జలమయం కావడంతో రవాణా కు అంతరాయం ఏర్పడింది. కలెక్టర్ నిశీష్ కుమార్, కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసారు. పలు చోట్ల గాలులకు చెట్లు నేలకొరిగాయి. సీతానగరం మండలం జోగమ్మపేట వద్ద జాతీయ రహదారిపై భారి చెట్టు పడిపోవడంతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. పోలీసులు, చెట్టును తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేసారు.

## భారీ వర్షాలతో లోతట్టు ప్రాంతాలు జలమయం

అమరావతి బాపట్ల జిల్లా తీరప్రాంతంలో అసాని తుపాను ప్రభావంతో వర్షాలు కురుస్తున్నాయి. బాపట్లలో 8 సెం.మీ., వేటపాలెంలో 5.54 సెం.మీ. వర్షపాతం నమోదు అయింది. బాపట్ల, రేపల్లె, నిజాంపట్నంలో వర్షంభట్టిప్రోలు, కొల్లూరు మండలాల్లో వర్షం దంచికొట్టింది. తుపాను తీవ్రత దృష్ట్యా అప్రమత్తమైన అధికారులు తగిన హెచ్చరికలు చేసారు. నిజాంపట్నం హార్బర్లో 8వ నంబర్ ప్రమాద హెచ్చరిక ను ఎగురవేసారు. బాపట్ల కలెక్టరేట్, తీర ప్రాంత మండలాల్లోని తహశీల్దార్ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్లుఏర్పాటు చేసారు. సముద్రంలో చేపల వేటకు వెళ్లొద్దని మత్స్యకారులకు హెచ్చరించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులు ఆదేశాలు జారీ చేసారు. నెల్లూరు జిల్లా ఇందుకూరుపేట మండలంలో మంగళవారం రాత్రి నుంచి విద్యుత్ నిలిచిపోయింది.?పాను ప్రభావంతో గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేసారు. రొయ్యల చెరువుల రైతులకు డీజిల్ దొరక్క ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కరెంటు లేక గంటకు 6 లీటర్ల చొప్పున జనరేటర్కు డీజిల్ వినియోగం అవుతోంది. రొయ్యల చెరువులు కాపాడుకునేందుకు రైతుల ఇబ్బందులు పడుతున్నారు. మైపాడు బీచ్ వద్ద సముద్రం 10 మీటర్లు ముందుకొచ్చింది. నెల్లూరు జిల్లావ్యాప్తంగా ఈదురుగాలులతో వర్షం కురిసింది.

## కడపలో భారీ వర్షాలు

కడప అసని తుఫాను ప్రభావంతో కడప జిల్లాలోబుధవారం భారీ వర్షాలు కురిసాయి. దాంతో కడప నగరంలోని లోతట్టు ప్రాంతాలు మొత్తం జలమయమయ్యాయి. పలు ప్రాంతాల్లో కాలువులు పొంగిపొర్లుతున్నాయి. రోడ్ల పైకి భారీ వర్షపు నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఆర్టీసీ బస్టాండ్ గ్యారేజిలోకి భారీ వర్షం నీరు చేరింది. ప్రతిసారి వర్షం పడితే ఇదే పరిస్థితి ఏర్పడుతుందని నగరవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# ఇంతింతై..వటుడింతై...

నెల్లూరు, హైదరాబాద్, మే 11,ఆంధ్ర ప్రదేశ్‌లో పదవ తరగతి పేపర్ లీకేజ్ వ్యవహారం నారాయణ విద్యా సంస్థల యజమాని, మాజీ మంత్రి నారాయణ మెడకు చుట్టుకుంది. హైదరాబాద్‌లో నారాయణను ఏపీ పోలీసులు అరెస్టు చేశారు. ఆయనపై ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ఎగ్జామినేషన్స్ ? ప్రివెన్షన్ ఆఫ్ మాల్‌ప్రాక్టీసెస్ అండ్ అన్‌ఫెయిర్ మీన్స్ చట్టంలోని సెక్షన్ 5, 8తో పాటు ఐపీసీ సెక్షన్ 408 కింద కేసు నమోదు చేశారు. నారాయణను అరెస్ట్ చేయడంతో రాజకీయ రగడ జరుగుతోంది. ఆయనను పోలీసులు చిత్తూరుకు తరలించారు. హైదరాబాద్ ఐకియా షోరూమ్ దగ్గర నారాయణను అరెస్టు చేసిన విషయం స్థానిక పోలీసులకు సమాచారం లేకపోవడం, మీడియాలో హడావుడి చోటుచేసుకోవడంతో నారాయణ ప్రయాణిస్తున్న కారును తెలంగాణ పోలీసులు కొత్తూరు టోల్‌గేట్ సమీపంలో ఆపారు. ఏపీ పోలీసులు ఈఎఖీ కాపీని చూపించడం, దాన్ని తెలంగాణ పోలీసులు ఉన్నతాధికారులకు పంపించడం చకచకా జరిగిపోయాయి. తెలంగాణ పోలీసు ఉన్నతాధికారుల నుంచి ఆమోదం రావడంతో నారాయణను ఏపీ పోలీసులు చిత్తూరుకు తరలించారు. 1979 లో ఓ చిన్న అద్దె గదిలో నారాయణ ట్యూషన్ సెంటర్ మొదలైంది. నెల్లూరు హరనాథపురంలో ఏర్పాటైన ఈ ట్యూషన్ సెంటర్ మొదలు కేవలం అయిదుగురు విద్యార్థులతో ప్రారంభమైంది. ఆ సంఖ్య రోజురోజుకీ పెరుగుతూ పోయింది. అతి కష్టమైన, క్లిష్టమైన లెక్కల్ని విద్యార్థులకు సులువుగా అర్ధమయ్యేలా చెప్పేందుకు నారాయణ చేసిన కృషి వృధాగా పోలేదు. నారాయణ ట్యూషన్ సెంటర్లో గణితం భలే చెబుతున్నారన్న విషయం ఆ నోటా ఈ నోటా పాకి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమంతా తెలిసిపోయింది. దీంతో, ఈ సెంటర్ లో మాథ్స్ నేర్పించాలని హైదరాబాద్, విశాఖపట్నం నుండి కూడా పిల్లలను తల్లిదండ్రులు తీసుకు రావడం మొదలయ్యింది. దీంతో, గణితంతో పాటూ ఇతర సబ్జెక్ట్స్ కూడా భోదించే ఉపాధ్యాయుల్ని కూడా తన బృందంలో

### నారాయణ... విద్యా సంస్థల ప్రస్థానం

చేర్చుకున్నారు. అలా ఓ చిన్న ట్యూషన్ సెంటర్‌గా మొదలైన ఆ ప్రస్థానం అనతి కాలంలోనే ఓ కోచింగ్ సెంటర్‌గా రూపుదిద్దుకుంది. డాక్టర్ నారాయణ ప్రణాళిక, చిత్తశుద్ధి, కృషితో పాటు బోధనా రంగంలో ఎంచుకున్న వినూత్న పద్దతులు, అద్భుత ఫలితాలు ఇచ్చాయి. నారాయణ కోచింగ్ సెంటర్‌లో చదువుకున్న విద్యార్థులు పోటీ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించడం మొదలైంది. ఇంజనీరింగ్ విభాగంలో అయితే నారయణకు పోటీ కూడా లేకుండా పోయింది. ఎంసెట్‌తో పాటు ఐఐటి పోటీ పరీక్షల్లోనూ నారాయణ విద్యార్థులు విజయ దుదుంభి మోగించారు. ఒకప్పుడు ఐఐటి సీటు అంటే తెలుగు విద్యార్థులకు సాధ్యమా అనుకునే పరిస్థితి నుండి ఆ విభాగంలో అత్యధిక స్థానాలు ఇక్కడి విద్యార్థులే సాధించే పరిస్థతి వచ్చింది. ఈ విషయంలో నారాయణ విద్యాసంస్థల పాత్ర ఎంత ఉందో ఆ సంస్థ విద్యార్థుల విజయాలే ఢంకా బజాయించి మరీ చెబుతాయి. అలాగే, వివిధ పోటీ పరీక్షల్లో విద్యార్థులని సన్నద్ధం చేసేందుకు మైక్రో షెడ్యూల్స్ రూపకల్పన చేయడానికి ఆయన ఆద్యుడు. దీంతోపాటు, ఏ పోటీ పరీక్షకు ఎలా సిద్ధం కావాలి అన్నదానిపై నారాయణ నిర్దేశకత్వంలో సంస్థ ఎన్నో ప్రయోగాలు చేసి అద్భుత ఫలితాలు చూపింది. దానికి సాక్ష్యమే ఇప్పుడు ఐఐటీ విద్యాసంస్థల్లో 15 నుండి 20 శాతం దాకా తెలుగు విద్యార్థులు చదువుకోవడం. నారాయణ విద్యాసంస్థ విజయాలతో పాటు అక్కడి క్రమశిక్షణ, బోధనా పద్దతుల గురించి తెలియడంతో విద్యార్థులు సంఖ్య బాగా పెరిగింది. నెల్లూరులో ఓ చిన్న అద్దెగదిలో మొదలైన నారాయణ సంస్థ ఇప్పుడు దేశమంతటా విస్తరించింది. ఓ ప్రతిష్టాత్మకమైన విద్యాసంస్థగా ఆవిర్భవించింది. దాదాపు 21 రాష్ట్రాల్లో 6 లక్షల మందికి పైగా విద్యార్థులు, 60 వేల మంది సిబ్బందితో విద్యాప్రస్థానం సాగిస్తున్నది. నారాయణ విద్యా సంస్థలో చదువుకుంటున్న విద్యార్థులు ఐఐటీ ? జేఈఈ, నీట్, బిట్ శాట్, ఏ.ఎఫ్.ఎం.సి, ఎయిమ్స్, జిప్ మర్ వంటి ప్రతిష్టాత్మక పోటీ పరీక్షల్లో రాణిస్తున్నారు. 1979లో నెల్లూరులో నారాయణ కోచింగ్ సెంటర్‌గా మొదలైన ఈ సంస్థ రాష్ట్ర స్థాయి ఎంట్రెన్స్ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు కోచింగ్ ఇచ్చేది. ప్రారంభించింది మొదలుగా గుర్తింపు పొందిన నారాయణ కోచింగ్ సెంటర్ నారాయణ ఆధ్వర్యంలో 1983 నాటికి పూర్తిస్థాయి విద్యాసంస్థగా అవతరించింది. 1990లో ఉన్నత పాఠశాల ప్రారంభించారు. 1993లో నెల్లూరులో నారాయణ మహిళా కళాశాల పేరిట బాలికల రెసిడెన్సియల్ కాలేజిని స్థాపించారు. 1999లో జూనియర్ కాలేజిని స్థాపించారు. అదే సంవత్సరం నెల్లూరు, హైదరాబాద్,

విశాఖపట్నం, విజయవాడల్లో ఐఐటీ-జేఈఈ కోచింగ్ కేంద్రాలను స్థాపించారు. 1990ల చివర్లో నారాయణ విద్యాసంస్థ ప్రొఫెషనల్ విద్యారంగంలో అడుగుపెట్టింది. 1998లో నెల్లూరులో 2001లో గూడూరులో ఇంజనీరింగ్ కాలేజీలను స్థాపించారు. 1999లో వైద్య కళాశాలను, 2001లో దంతవైద్య కళాశాలను స్థాపించారు. 2002లో మెడికల్ కాలేజీలో పారామెడికల్ విభాగాన్ని ప్రారంభించారు. అదే సంవత్సరం జూనియర్ కాలేజీలు, ఎంసెట్ కోచింగ్ సెంటర్లను తిరుపతి, కర్నూలు, అనంతపురం, రాజమండ్రి, కాకినాడ పట్టణాల్లో ప్రారంభించారు. ఉత్తర భారత దేశం లో ని వివిధ ప్రాంతాల్లో లో పిఎమ్‌టి, ఐఐటి-జేఈఈ కోచింగ్ సెంటర్ల ఏర్పాటుతో నారాయణ విద్యాసంస్థల నేతృత్వం మరింత బలోపేతమయింది. ఈ సంస్థ 2004-05లో కరెస్పాండెన్స్ విభాగాన్ని, 2007లో అఖిలభారత టెస్ట్ సీరీస్ ఆన్‌లైన్ వెర్షన్‌ను ప్రారంభించింది. పదోవ తరగతి ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారాన్ని విద్యా శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావడంతో రాష్ట్ర ప్రభుత్వం దర్యాప్తునకు ఆదేశించింది. గత నెల 27న మొదలైన టెన్త్ పేపర్స్ వాట్సప్ గ్రూప్స్‌లో సర్క్యులేట్ అయ్యాయి. దీంతో చిత్తూరు జిల్లా డీఈవో పురుషోత్తం ఇచ్చిన ఫిర్యాదుతో చిత్తూరు వన్ టౌన్ పోలీసులు ఏప్రిల్ 27న కేసు నమోదు చేశారు. పరీక్షల నిర్వహణలో ఎటువంటి తప్పిదాలకు అస్కారం లేకుండా తాము చర్యలు చేపట్టామని, తమ నుంచి పరీక్ష పత్రం

## గంగమ్మ తల్లికి సారె సమర్పించిన భూమన కరుణాకర రెడ్డి



### కుటుంబ సభ్యులతో కలిసి మొక్కులు తీర్చుకున్న ఎమ్మెల్యే భూమన

తిరుపతి శ్రీ తాతయ్య గుంట గంగమ్మ కు తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి, నగర డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ కుటుంబ సమేతంగా బుధవారం ఉదయం పట్టు చీర, సారె సమర్పించారు. స్థానిక పద్మావతి పురం లోని తన నివాసం వద్ద పూజలు నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులు, బంధువులు, అభిమానులతో కలసి వూరేగింపుగా బయలుదేరారు. సప్పరాలు, కోలాటాలు, పిల్లనగ్రోవిలు, డప్పులు, సన్నాయి వాయిద్యాల మధ్య, భక్తులువిచిత్ర వేషధారణలతో, లయబద్ధ విన్యాసాలతో శోభా యాత్ర గంగమ్మ ఆలయం వైపు సాగింది. భూమన నివాసం నుంచి శ్రీనివాసా కల్యాణ మండపాల మార్గం, లక్ష్మీపురం సర్కిల్, డీఆర్ మహల్ రోడ్డు, గ్రూప్ థియేటర్స్ మార్గం మీదుగా కొనసాగిన ఆధ్యాత్మిక యాత్రకు దారి పొడవునా భక్తులు పసుపు నీళ్లు పోస్తూ, పూలు చల్లుతూ ఆద్యంతం స్వాగతించారు. అడుగడుగునా ఆర్త జనుల కర్పూర హారతులిస్తూ భక్తి పారవశ్యంతో పులకించారు. తిరుపతి పుణ్యక్షేత్రంలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా భక్తులు ఉత్సాహంగా యాత్రలో పాల్గొని, సందడి చేశారు. ఈ భక్తి యాత్ర తిరుపతి చరిత్రలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి ప్రతిష్టాత్మకరంగా పరిగణిస్తూ... నిర్వహించ తలపెట్టిన కారణంగా ఈ గంగ జాతర మరింత వైభవాన్ని సంతరించుకుకుంది.

భక్తి ప్రపత్తులు చాటుకున్న ముస్లీంలు...

స్థానిక డీఆర్ మహల్ ఎదుట భూమన కుటుంబ సభ్యులను స్వాగతిస్తూ ముస్లీం సోదరులు, సోదరీమణులు తమ భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. పెద్ద సంఖ్యలో ఆధ్యాత్మిక యాత్రలో పాల్గొన్నారు. అమ్మ వారికి సారె సమర్పించిన భూమన కుటుంబసభ్యులు...శ్రీ తాతయ్య గుంట గంగమ్మకు భూమన కరుణాకర రెడ్డి , భూమన అభినయ్ తమ కుటుంబ సభ్యులతో తమ నివాసం వద్ద నుంచి వూరేగింపుగా గంగమ్మ ఆలయానికి చేరుకుని పట్టు చీర సమర్పించారు. శ్రీ తాతయ్య గుంట గంగమ్మ జాతరలో భాగంగా మంగళవారం రాత్రి చాటింపు జరగగా, మరుసటి రోజైన బుధవారం భూమన కరుణాకర రెడ్డి తమ కుటుంబ సభ్యలతో కలిసి అమ్మ వారికి సారె సమర్పించి, అమ్మ వారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. జాతర చరిత్రలో ఇంత పెద్ద ఎత్తున శోభాయాత్ర నిర్వహించడం, సారె సమర్పించడం ఇదే తొలి సారి కావడం విశేషం. కాగా, అమ్మ వారి సేవలో పాల్గొన్న భూమన కుటుంబానికి ఆలయ పాలక మండలి ప్రతినిధులు, అర్చకులు తీర్థప్రసాదాలను అందించారు.

## జిల్లా అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలి

### ఎటువంటి ప్రాణనష్టం లేకుండా జాగ్రత్త చర్యలు చేపట్టాలి
### అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి

నెల్లూరు నెల్లూరు కలెక్టరేట్ లోని ఎస్.ఆర్. శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో "అసని" తుఫాను నేపథ్యంలో రాష్ట్ర వ్యవసాయ సహకార శాఖ మాత్యులు కాకాని గోవర్ధన్ రెడ్డి బుధవారం మధ్యాహ్నం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాను ఈ కారణంగా జిల్లాలో ఎటువంటి ప్రాణ నష్టం ఆస్తి నష్టం సంభవించకుండా జిల్లా అధికార యంత్రాంగం తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. జిల్లా అధికారులు ఎప్పటికప్పుడు నిరంతరం గ్రామీణ ప్రాంతాల పరిస్థితిపై సమీక్షించాలి అన్నారు.. విద్యుత్, ఫైర్, పోలీస్, పురపాలక శాఖ, మండల స్థాయి అధికారులు ప్రతి ఒక్కరు సమిష్టిగా పనిచేయాలని ఆదేశించారు. సహాయక కేంద్రాల ఏర్పాటు తదితర అంశాలపై మంత్రి జిల్లా అధికారులకు పలు సూచనలు జారీ చేశారు ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చక్రధర బాబు, జాయింట్ కలెక్టర్ హరేంద్ర ప్రసాద్ నెల్లూరు నగర కార్పొరేషన్ కమిషనర్ జాహ్నవి, ఏఎస్పీ వెంకటరత్నం విఆర్వో వెంకట రమణమ్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు

## సంక్షేమానికి మారు పేరు సియం వైఎస్ జగన్

### ఎమ్మెల్యే పి రవీంద్రనాథ్ రెడ్డి

కడప ప్రజా సంక్షేమమే పరమావధిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పరిపాలన చేస్తున్నారని దీనిపై ప్రజల ఛీత్కారానికి గురైన తెలుగు దేశం పార్టీ నాయకులు ఓర్వలేక దౌర్జన్యాలకు, దుర్మార్గపు చర్యలకు పాల్పడుతోందని కమలాపురం ఎమ్మెల్యే పి రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు బుధవారం కడప నగరంలోని వైఎస్ ఆర్ సీపీ జిల్లా కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు గత ఎన్నికల ముందు పాదయాత్రలో భాగంగా ప్రజలనుండి వచ్చిన సమస్యలనే పథకాలుగా ప్రవేశపెట్టి ఆదిశగా రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమం వైపు నడిపిస్తున్నారని అన్నారు తమ వైయస్సార్ కాంగ్రెసు పార్టీ అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు అయిందని ప్రజలకిచ్చిన అన్ని రకాల హామీలను, నెరవేరుస్తూ అందరికీ సంక్షేమాన్ని అందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారన్నారు కరోనా కష్టకాలంలో కూడా ప్రజలకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా అద్భుతంగా చేశారన్నారు దేశంలో అన్ని రాష్ట్రాలు కరోనా బూచి చూపి పథకాలు నిలిపి వేసినా సియం వైఎస్ జగన్ మాత్రం ప్రజలకు అన్ని రకాల సహాయ సహకారాలు అందజేస్తున్నారని చెప్పారు దీంతో దేశంలోని అన్ని రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్ వైపు చూసేలా నంబర్ వన్ స్థానం లో నిలిచారని చెప్పారు దేశంలో సంక్షేమ క్యాలెండరు ప్రవేశ పెట్టిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డేనని అన్నారు విద్యా, వైద్యం, వ్యవసాయం పై దృష్టి సారించి అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తున్నారని పేర్కొన్నారు నాడు నేడు క్రింద అనేక పాఠశాలలను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి చేసి అన్ని వర్గాల ప్రజల పిల్లల భవిష్యత్తు కోసం బంగారు బాట వేశారని చెప్పారు వైఎస్ ఆర్ ఆరోగ్యశ్రీ కింద 2600 జబ్బులను చేర్చి అందరికీ వర్తించే విధంగా చర్యలు తీసుకున్నారని చెప్పారు అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందేలా చూస్తున్నారని చెప్పారు ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ వైయస్సార్ కాంగ్రెసు పార్టీ అఖండ విజయాన్ని సొంతం చేసుకుందన్నారు ఏ రాష్ట్రంలో జరగని సంక్షేమం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరుగుతోందన్నారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు గడప గడపకు మన ప్రభుత్వం అనే నినాదంతో ప్రజల్లోకి వెళ్లి సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయా లేదా అనే విషయాలను తెలుసుకుని అందని వారికి అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు ఈ సమావేశంలో కార్పోరేటర్ పాకా సురేష్, వైఎస్ ఆర్ సీపీ నాయకులు అమర్నాథ్ రెడ్డి,వీరప్రతాప్ రెడ్డి, గోవింద రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## కర్నూలు లో బిజెపి కార్యాలయానికి భూమి పూజ

### పాల్గోన్నల బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు సోమువీర్రాజు

కర్నూలు కర్నూలు లో భారతీయ జనతపార్టీ కార్యాలయానికి శంకుస్థపాన నిర్వహించారు . ఇద్దరు స్థల దాతలు బిజెపి కార్యాలయానికి ఎంతో ఉ దారంగా స్థలాన్ని ఇవ్వడం జరిగింది. సుమారు 50 సెంట్లు భూమిలో బిజెపి జిల్లా కార్యాలయాన్ని నిర్మాణం సంవత్సరంలో పూర్తి చేస్తామని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు సోమువీర్రాజు ప్రకటించారు. బిజెపి ని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేస్తున్నామని ఈ కార్యక్రమంలో భాగంగా పోలింగ్ భూత్ స్థాయిలో కమిటీలు వేస్తున్నామన్నారు . వైసిపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా బిజెపి మాత్రమే పోరాటం చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు టిజి వెంకటేష్. బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, బవన నిర్మాణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ సైదారెడ్డి, స్థల దాతలు రాఘవేంద్ర రావు ,తుమ్మెపల్లి రామారావు, జిల్లా అధ్యక్షుడు పోలంకి రామాస్వామి, విట్టా రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## రైలునుంచి వేరువడిన ఇంజన్..ప్రయాణికులు సురక్షితం

పార్వతీపురం విశాఖపట్నం నుంచి ఢిల్లీలోని హజ్రత్ నిజాజముద్దిన్ వెళ్లే సమత సూపర్ ఫాస్ట్ రైలుకు పెను ప్రమాదం తప్పింది. మన్యం జిల్లాలోని గుచ్చిమి రైల్వే గేట్ సమీపంలో ఇంజన్ బోగి విడిపోయింది. సుమారు కిలోమీటర్ పైగా బోగీలను విడిచి ఇంజన్ వెళ్లిపోయింది. దీంతో ప్రయాణికులు ఆందోళనకు గురైయారు. విషయం తెలుసుకున్న లోకోపైలెట్ ఇంజన్ ను తిరిగి బోగీల దగ్గరకు తెచ్చి అనుసంధానించారు. ఈ సమస్య కారణంగా సమతా ఎక్స్ ప్రెస్ రైలు సుమారు గంటసేపు నిలిచిపోయింది.

## ఉద్యోగ, కార్మిక కుటుంబాల ఆత్మీయ సమ్మేళనం


### కరపత్రం ఆవిష్కరణ

పెద్దపల్లి ఉద్యోగ, కార్మిక కుటుంబాల ఆత్మీయ సమ్మేళనం కరపత్రం ఆవిష్కరణను బుధవారం స్థానిక ప్రెస్ క్లబ్ లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఈడబ్ల్యూఎస్ అధ్యక్షుడు శంకర్ మాట్లాడుతూ వేతన జీవుల జీవితాల్లో మార్పులు తీసుకువచ్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ రూపొందించాలని ఆల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ సొసైటి రాష్ట్ర అధ్యక్షుడు అధ్యక్షుడు లింగంపల్లి శంకర్ కోరారు. జూన్ 8న జరగబోయే మహనీయులు, మన అభివృద్ధి ఉద్యోగ, కార్మిక కుటుంబాల ఆత్మీయ సమ్మేళనంలో అందరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. వేతన జీవులు జీతాల కోసం ఎదురుచూసే పరిస్థితిని నివారించి, నేల మొదటి రోజునే వేతనాలు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. బదిలీలు, ప్రమోషన్లు, రైతులు పండించిన దాన్యం కొనుగోలు, ధరణి వెబ్ సైట్లో సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి సంటి నంబన్న, నాయకులు కుక్క వెంకటస్వామి, నర్సయ్య, రాజేషం, కల్వల శ్రీనివాస్, కోటేశ్వర్, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

## వైశాఖ పౌర్ణమికి రెండో విడత చందన సమర్పణ

### : పౌర్ణమి వరకు గుమ్మడి పండు అలంకరణలో భక్తులకు అప్పన్న దర్శనం

సింహాచలం.. మే 11 ఉత్తరాంధ్ర జిల్లాల ప్రజల ఆరాధ్య దైవం, భక్తకోటి ఇలవేల్పు సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహస్వామికి వైశాఖ పౌర్ణమి సందర్భంగా రెండో విడత మూడు మణుగుల చందనాన్ని శాస్త్రోక్తంగా సమర్పించనున్నారు.. ఏడాది పొడవునా సుగంధభరిత చందనంలో ఉండే స్వామి ఒక్క వైశాఖ శుద్ధ తదియ నాడు మాత్రమే భక్తులకి తన నిజరూప దర్శనము గావిస్తారు. దీనినే భక్తులంతా చందనయాత్ర గా ,చందనోత్సవం గా పిలవడం జరుగుతుంది.. నిజరూపదర్శనం రోజు రాత్రికి మూడు మణుగుల చందనాన్ని తొలివిడతగాస్వామికి సమర్పించారు రెండో విడతగా వచ్చే వైశాఖ పౌర్ణమి నాడు మరో మూడు మణుగుల చందనాన్ని సమర్పించనున్నారు.. ఇందుకోసం ఆలయ సిబ్బంది ఇప్పటికే చురుగ్గా చందనము అరగతీత ప్రక్రియకు శ్రీకారం చుట్టారు.. జేష్ట పౌర్ణమికి మూడో విడతగా మూడు మణుగుల చందనాన్ని సమర్పిస్తారు. ఆషాడ పౌర్ణమి నాడు నాలుగో విడత గా మరో మూడు మణుగుల చందనాన్ని సమర్పిస్తారు. ఇక. శ్రావణ పౌర్ణమికి కరాళ చందన సమర్పణ తో మొత్తం ప్రక్రియ పూర్తి కానుంది.. ఇలా ఏడాదిలో నాలుగు విడతలుగా పన్నెండు మణుగుల చందనాన్ని స్వామికి సమర్పించడం పురూరవచక్రవర్తుల కాలం నుంచి ఆనవాయితీగా వస్తోంది..అప్పన్న దర్శనం అపురూపం గుమ్మడి పండు అలంకారంలోఉన్న సింహాద్రి నాధుడు ను అప్పన్న ధర్మకర్తల మండలి సభ్యులు, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి ,వైజాగ్ జర్నలిస్టుల ఫోరం అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.. వైశాఖ పౌర్ణమి వరకూ స్వామి ఇదే అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారు





# మాజీ మంత్రి నారాయణ అక్రమ అరెస్టు కక్ష్య సాదింపు చర్యే

## తెలుగురైతు రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమకాంత్ రెడ్డి

## ప్రతి తెలుగు దేశం పార్టీ కార్యకర్త సభ్యత్వం నమోదు చేసుకోవాలి

మంత్రాలయం : రాష్ట్రంలో తుగ్లక్ పాలన నడుస్తుందనడానికి మాజీ మంత్రి నారాయణ అక్రమ అరెస్టే నిదర్శనమని పెద్ద కడూబురు మండలం సీనియర్ నాయకులు రైతు సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమకాంత్ రెడ్డి అన్నారు. పెద్ద కడూబురులో మండల కన్వీనర్ బసలదోడ్డి ఈరన్న అధ్యక్షతన జరిగిన తెలుగు దేశం పార్టీ సభ్యత్వం నమోదు కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ప్రతి తెలుగు దేశం పార్టీ కార్యకర్త సభ్యత్వం నమోదు చేసుకోవాలి ప్రతి గ్రామంలో సభ్యత్వం నమోదు కార్యక్రమం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు అలాగే వైయస్సార్ ప్రభుత్వం పై విరుచుకుపడ్డాడు వారు మాట్లాడుతూ రాష్ట్రంలో తుగ్లక్ పాలన నడుస్తుంది అని మాజీ మంత్రి నారాయణ కుమారుడు వర్ధంతి కార్యక్రమం ఏర్పాటు లో వుంటే అక్రమంగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్యలో వ్యతిరేకంగా వుంది అని ప్రతిపక్ష నేతలు పై అక్రమ అరెస్టు చేయడం కాదు తుఫాను వచ్చి ఉత్తరాంధ్రలో నష్టపోయిన వారికి సహాయము చేసి ఆదుకోవాలని వైయస్సార్ ప్రభుత్వం పై విరుచుకుపడ్డాడు. ఈ కార్యక్రమంలో కురువ మల్లికార్జున, ఏసేబు, మీసేవా ఆంజనేయులు, ఐ టిడిపి బృందం సల్మాన్ రాజు, నీలకంఠ, కురువ కృష్ణా తదితరులు పాల్గొన్నారు.





# దేశ ప్రజలు రాహుల్ గాంధీ కుటుంబాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

బద్వేలు ,దేశ ప్రజల కోసం తమ ప్రాణాల్ని, రక్తాన్ని, ఎన్నో ఉన్నత పదవులనుత్యాగం చేసిన ఘనచరిత్ర గాంధీ కుటుంబానికి దక్కిందని, డిసిసి మైనార్టీ ప్రెసిడెంట్ ఆడిటర్ మన్సూర్ అలీ ఖాన్ అన్నారు. రాయచోటి నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు లను కాంగ్రెస్ బ్లాక్ రిటర్నింగ్ ఆఫీసర్లుగా ఎంపికై నెల్లూరులో జరిగిన కాంగ్రెస్ సదస్సులో పాల్గొని శిక్షణ పొంది నేడు రాయచోటికి విచ్చేసి సందర్భంగా తమ పార్టీ కార్యాలయంలో



ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా ఎన్నో ఉన్నత పదవులు చేపట్టడానికి వచ్చిన అవకాశాన్ని వదులుకొని, కేవలం ప్రజల కోసమే తమ కుటుంబం ఉందని గాంధీ కుటుంబం నిరూపించిందని ఆయన పేర్కొన్నారు. దేశ ప్రజల కోసం ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ తమ ప్రాణాల్ని అర్పించిన విషయాన్ని గుర్తు చేశారు. 138 ఏళ్ల ఘనచరిత్ర గల జాతీయ కాంగ్రెస్ పార్టీ ను స్థాపించి ఎన్నో సవాళ్లను ఎదుర్కొని, ఎన్నో కష్టాలను అనుభవించి, పార్టీ పరిస్థితులను, పార్టీ సిద్ధాంతాలను కాపాడుకుంటూ వస్తున్న గాంధీ కుటుంబానికి ఈదేశ ప్రజలు రుణపడి, గౌరవించాలన్నారు. భారతదేశం చరిత్రలో ఎన్నో ఉన్నత పదవులను త్యాగం చేసి ప్రజలకు అండగా నిలబడిన గాంధీ కుటుంబాన్ని ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు.ప్రజలను కోరారు. ప్రజలు గాంధీ కుటుంబం త్యాగాలను చూసి కాంగ్రెస్ పార్టీని ఆదరించి రాబోయే 2024 వ సంవత్సరం లోక్సభ ఎన్నికల్లో రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేసి క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న దేశాన్ని కాపాడాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ దర్బార్ భాష, శర్వాణిఫారుక్ ఖాన్ పాల్గొన్నారు.

# బోయ తేజశ్విని ను హత్యాచారం చేసి చంపిన దోషులను తక్షణమే బహిరంగంగా ఎన్ కౌంటర్ చెయ్యాలి...

## ఆంధ్రప్రదేశ్ వాల్మీకి యువసేన

తుగ్గలి: ప్రేమ పేరుతో ఎవ్వరు లేని ప్రదేశంకు తీసుకెళ్లి హత్యాచారం చేసి ఆపై ఫ్యాన్ కు ఉరివేసి చంపేసిన మానవ మృగాలను బహిరంగంగా ఎన్కౌంటర్ చెయ్యాలని ఆంధ్రప్రదేశ్ వాల్మీకి యువసేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సూరన్న వాల్మీకి డిమాండ్ చేశారు.రాజకీయ అండదండలు కలిగిన దోషులను కాపాడాలని చూసిన ప్రభుత్వం అధికారులు మొదట పోస్టుమార్టం చేసినప్పుడు ఆత్మహత్య గా చిత్రీకరించాలని చూడటం జరిగింది.ప్రజాసంఘాల ఉద్యమాలతో రిపోస్టుమార్టం చేసినప్పుడు ఆత్మహత్య కాదు హత్యాచారం జరిగినట్లు గుర్తించారు.రాజకీయ అండదండలు ఉంటే ప్రేమ పేరుతో నమ్మించి ఎన్ని హత్యలు చేసిన వారిని ఈ ప్రభుత్వం వెనకేసుకొస్తుందా అని ప్రశ్నించారు...?దోషులకు సంబందించిన విషయాలను గోప్యంగా ఉంచి ఈ హత్యాచారం వెనుక ఉన్నటువంటి రాజకీయ నాయకులను కాపాడే ప్రయత్నం చేయడం దుర్మార్గమైన చర్య దినివేనుక చాలా మంది హస్తం ఉందని వారు తెలియజేశారు.దిశా ప్రకారం నేరం రుజువు అయితే 21 రోజుల్లోనే దోషులకు శిక్ష పడుతుందని చెప్పుకొనే ఈ ప్రభుత్వం బోయ తేజశ్విని విషయంలో ఆత్మహత్య కాదు,హత్యాచారం జరిగిందని తెలిసినా ఎందుకు దోషులను శిక్షించడం లేదు అని వారు ప్రశ్నించారు.మహిళలపై హత్యాచారాలు ఒకటి మరువక ముందే ఇంకోటి జరుగుతూనే ఉన్న కూడా ఈ ప్రభుత్వానికి జాలి కలగపోవడం దారుణమని తెలియజేశారు. మహిళలకు ప్రభుత్వం పై భరోసా కలగాలంటే తక్షణమే ఆ మానవ మృగాలను బహిరంగంగా ఎన్కౌంటర్ చెయ్యాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో త్వరలో ఈ విషయం పై ఉద్యమ కార్యచరణ చేసి మహిళల పట్ల మీ ప్రభుత్వానికి ఉన్నా కపట ప్రేమను రాష్ట్రం అంతటా తెలిసేలా ఉద్యమాలు చేపడతామని వారు తెలియజేశారు.

# వాసవి జయంతి వేడుకల్లో సీతారామిరెడ్డి

మంత్రాలయం :మంత్రాలయం మండల కేంద్రంలో ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం వాసవి కన్యాకపరమేశ్వరి జయంతి వేడుకలను సంఘం అధ్యక్షులు నారాయణ శెట్టి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారి చిత్రపటాని గ్రామంలో పురవీధుల గుండా ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో ఉరేగించారు. అనంతరం ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో గౌతమ్ స్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. వాసవి జయంతి సందర్భంగా ఎమ్మిగనూరు ఆర్టీసీ డిపో ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు వై. సీతారామిరెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆయనకు శాలువ కప్పి, తీర్థ ప్రసాదాలను అందజేసి ఆశీర్వాదించారు. ఈయనతో పాటు మంత్రాలయం సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, ఉప సర్పంచ్ హోటల్ పరమేష్, ఎంపిటిసి సభ్యులు వెంకటేష్ శెట్టి, నాయకులు జనార్దన్ రెడ్డి, కృష్ణ స్వామి, బద్రినాథ్ శెట్టి, దామోదర్ శెట్టి, ప్రహ్లాదయ్య శెట్టి, ఫణీరాజ్, కందుకూరు బసవరాజు తదితరులు ఉన్నారు.



# ఇంధన పొదుపు కు ప్రశంస పత్రాలు




నంద్యాల – నంద్యాల జిల్లా కేంద్రంలో బుధవారం నాడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా గ్యారేజ్ లో ఇంధన పొదుపు ఉత్సవాల సందర్భంగా జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ .ప్రయాణికులను ఒక ప్రదేశం నుండి మరొక ప్రదేశానికి సురక్షితంగా చేరవేయడంలో ఆర్టీసీ డ్రైవర్ల పాత్ర కీలకమైందని జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జిలాని సామూన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కడప ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గోపీనాథ్ రెడ్డి, డిపో మేనేజర్ సర్దార్ హుస్సేన్, డిప్యూటీ సీఎంఈలు రజియా సుల్తానా, భాస్కర్ లు, అసిస్టెంట్ మేనేజర్ మద్దిలేటినాయుడు తదితరులు పాల్గొన్నారు.అనంతరం ఆర్టీసీ బస్సులను ఇంధనం పొదుపుగా వాడటం తో పాటు ప్రయాణికులను గమ్యస్థానాలకు క్షేమంగా చేర్చిన 14 మంది ఉత్తమ డ్రైవర్లను శాలువాతో సత్కరించి మెమెంటోతో పాటు ప్రశంసా పత్రాన్ని అందించారు. అంతకుముందు డిపో గ్యారేజ్ ఆవరణలో జిల్లా కలెక్టర్ మొక్కలు నాటారు.

# జిల్లా అధికారులను కలసిన రేషన్ డీలర్ల సంఘం నాయకులు

నంద్యాల్ :– నంద్యాల జిల్లా కేంద్రంలో బుధవారం నాడు నంద్యాల జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం కమిటీ నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ నారపరెడ్డి మౌర్య .జిల్లా డీఎస్ఓ. జిల్లా డి ఎం ను మర్యాదపూర్వకంగా కలవడం జరిగిందని తెలిపారు . డీలర్ల యొక్క పలు సమస్యలను అధికారుల



దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు జక్కా సుబ్బరాయుడు ఆర్లగడ్డ. జిల్లా అధ్యక్షులు బ్రహ్మం. ప్రధాన కార్యదర్శి కలిముల్లా. జిల్లా కోశాధికారి చాంద్ బాషా. నందికొట్కూరు జిల్లా ఉపాధ్యక్షులు హరి ప్రసాద్ రెడ్డి. వెలుగోడు కమిటీ సభ్యులు. నంద్యాల అధ్యక్షులు సమద్.నంద్యాల ప్రధాన కార్యదర్శి కిరణ్. సెక్రటరీ రవి.హరి. నంద్యాల ఫాతిమాబి. నంద్యాల కోయిలకుంట్ల సుధాకర్ రెడ్డి. పుల్లయ్య. పాణ్యం మండలం డీలర్ల అసోసియేషన్ అధ్యక్షులు జయరామిరెడ్డి . నంద్యాల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# 'మేజర్' వెనకున్న సూపర్ పవర్ మహేశ్ గారే!




అడివి శేష్ హీరోగా 'మేజర్' సినిమా రూపొందింది. మహేశ్ బాబు నిర్మించిన ఈ సినిమాకి శశి కిరణ్ తిక్క దర్శకత్వం వహించాడు. 26/11 ముంబైలోని హోటల్ పై జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో నడిచే కథ ఇది. మేజర్ సందీప్ ఉన్నికృష్ణన్ జీవితచరిత్రగా ఈ సినిమా నిర్మితమైంది. అడివి శేష్ సరసన నాయికలుగా సయీ మంజ్రేకర్ – శోభిత ధూళిపాళ అలరించనున్నారు. ఈ సినిమాకి శ్రీ చరణ్ పాకాల సంగీతాన్ని సమకూర్చాడు. కొంతసేపటి క్రితం ఈ సినిమా నుంచి మహేశ్ బాబు ట్రైలర్ ను రిలీజ్ చేశారు.ఈ వేదికపై దర్శకుడు శశి కిరణ్ తిక్క మాట్లాడుతూ .. "అడివి శేష్ తో నేను చేసిన రెండో సినిమా ఇది. 2018లో మా 'గూఢచారి' సినిమా వచ్చింది. ఆ వెంటనే ' మేజర్' చేద్దామని అడివి శేష్ చెప్పాడు. అప్పటికి నేను వేరే ప్రాజెక్టు ఆలోచనలో ఉన్నాను. కానీ మేజర్ సందీప్ ఉన్నికృష్ణన్ గారు గురించి శేష్ చెప్పగానే ఆయన గురించి నేను కూడా రీసెర్చ్ చేయడం మొదలుపెట్టాను. ఈ స్టోరీ చెప్పకపోతే తప్పవుతుందని అనిపించింది. దాంతో నేను ఈ సినిమా చేయడానికి వచ్చాను.ఈ సినిమా కోసం మా టెక్నీషియన్స్ అంతా కూడా ఎంతో కష్టపడ్డారు. ఆర్టిస్టుల గురించి చెప్పాలంటే సయీ చాలా వండర్ఫుల్ ఆర్టిస్ట్ .. అలాగే శోభిత కూడా. ప్రకాశ్ రాజ్ గారు .. రేవతి గారి గురించి కొత్తగా నేనేమీ చెప్పనవసరం లేదు. ఈ సినిమా కోసం నేను సందీప్ ఉన్నికృష్ణన్ పేరెంట్స్ ను కలిశాను. వాళ్లతో మాట్లాడుతున్నప్పుడు నాకు ఎలాంటి ఫీల్ కలిగిందో షూటింగు సమయంలో మానిటర్ చూస్తున్నప్పుడు కూడా అలాగే కళ్ల వెంట నీళ్లొచ్చాయి. రెండు సందర్భాల్లోను ఒకే రకమైన అనుభూతి కలగడం విశేషం.జరిగిన సంఘటనను గురించి నేను వింటూ ఎలా ఫీల్ అయ్యానో .. నా ద్వారా మహేశ్ సార్ .. మేడమ్ వింటూ అదే ఫీలయ్యారు. అదే ఫీల్ ను స్క్రీన్ ద్వారా ఆడియన్స్ పొందుతారని భావిస్తున్నాను. శేష్ గురించి చెప్పాలంటే నేను చాలా చెప్పచ్చు. ఆయన గురించి ఒక బుక్ రాయవచ్చు. ఆ బుక్ ను నా కంటే మంచిగా ఎవరూ రాయలేరు. శేష్ తో పోటీపడితే టాప్ కి వెళ్లిపోతాం అనే విషయం నాకు అర్థమైంది .. తనతో పోటీపడాలంతే. మహేశ్ గారు ఈ సినిమా వెనుక ఉండటం వలన ఒక సూపర్ పవర్ ఉన్నట్టుగా అనిపించింది. ఆ ధైర్యంతోనే ముందుకు వెళ్లడం జరిగింది" అని చెప్పుకొచ్చాడు.

# కలిసొచ్చిన 'కళ్యాణం'.. బంపర్ ఆఫర్ పట్టిన విశ్వక్ సేన్


విశ్వక్ సేన్.. గత కొద్ది రోజుల నుంచీ ఈ పేరు అటు ప్రధాన మీడియాలోనూ ఇటు సోషల్ మీడియాలోనూ మారిమోగిపోతున్న సంగతి తెలిసిందే. 2017లో విడుదలైన 'వెళ్ళిపోమాకే' సినిమాతో హీరోగా టాలీవుడ్ లోకి అడుగు పెట్టాడు. ఆ తర్వాత 'ఈ నగరానికి ఏమైంది' 'ఫలక్నుమాదాస్' 'హిట్' చిత్రాలతో మంచి గుర్తుంపు సంపాదించుకున్న విశ్వక్ సేన్.. హీరో మాత్రమే కాదు దర్శకుడు స్క్రీన్ ప్లే రచయిత కూడా. ఇక ఈ యంగ్ హీరో తాజా చిత్రం



'అశోకవనంలో అర్జున కళ్యాణం'.విద్యాసాగర్ చింతా దర్శకత్వం వహించిన ఈ సినిమాలో రుక్సార్ ధిల్లన్ రితిక నాయక్ హీరోయిన్లుగా నటించారు. బి.వి.ఎస్.ఎన్ ప్రసాద్ సమర్పణలో ఎస్విసిసి డిజిటల్ బ్యానర్పై బి. బాపినీడు సుధీర్ ఈదర నిర్మించగా.. జయ ఫణి కృష్ణ సంగీతం అందించారు. రొమాంటిక్ ఎంటర్టైనర్ గా రూపుదిద్దుకున్న ఈ మూవీ మే 6న ప్రేక్షకుల ముందుకు వచ్చి పాజిటివ్ టాక్ సొంతం చేసుకుంది. ఇందులో ముప్పై మూడు ఏళ్ళు వచ్చినా పెళ్లి కాని అర్జున్ కుమార్ అల్లంగా విశ్వక్ సేన్ తనదైన నటనతో అదరగొట్టేశారు.ఈ సినిమాతోనే విశ్వక్ సేన్ క్రేజ్ నెక్స్ట్ లెవల్ కి చేరింది. ఫ్రాంక్ వీడియో విషయంలో ఎప్పుడైతే ప్రముఖ టీవీ యాంకర్ దేవీ నాగవల్లితో వివాదం ఏర్పడిందో.. అప్పటి నుంచీ విశ్వక్ సేన్ ఫాలోయింగ్ అంతకంతకు పెరిగిపోతోంది. పైగా అశోకవనంలో అర్జున కళ్యాణం తొలిరోజే మంచి టాక్ సొంతం చేసుకోవడంతో.. విశ్వక్ సేన్ కు మరింత కలిసొచ్చింది. ఈ నేపథ్యంలోనే తాజాగా ఈ యంగ్ హీరో ఓ బంపర్ ఆఫర్ పట్టేశాడు.ప్రముఖ బడా నిర్మాత అల్లు అరవింద్ తమ గీతా ఆర్ట్స్ బ్యానర్ లో విశ్వక్ సేన్ చేత ఓ సినిమా చేయాలని భావిస్తున్నారట. త్వరలోనే గీతా ఆర్ట్స్ కోసం విశ్వక్ సేన్ ఓ కొత్త ప్రాజెక్టు సైన్ చేయనున్నాడని తాజాగా ఓ టాక్ బయటకు వచ్చి నెట్టింట వైరల్ గా మారింది. మరి ఒకవేళ ఈ ప్రచారమే నిజమై.. విశ్వక్ సేన్ గీతా ఆర్ట్స్ బ్యానర్ లో ఓ సూపర్ హిట్ మూవీ చేస్తే ఇక అతడి కెరీర్ కు తిరుగుండదనే చెప్పాలి.కాగా అల్లు అరవింద్ కు ఇలా యంగ్ హీరోలకు ఛాన్సులు ఇవ్వడం కొత్తేమి కాదు. గతంలో 'పెళ్లి చూపులు' మూవీతో ప్రేక్షకులకు కనెక్ట్ అయిన విజయ్ దేవరకొండతో గీతా ఆర్ట్స్ బ్యానర్ పై అల్లు అరవింద్ 'గీత గోవిందం' చేయగా.. అది బ్లాక్ బస్టర్ హిట్ అయింది. ఆ తర్వాత 'ఆర్ఎక్స్ 100'తో క్రేజ్ తెచ్చుకున్న కార్తికేయతో గీతా ఆర్ట్స్ సంస్థ 'చావు కబురు చల్లగా' తెరకెక్కించింది. ఈ సినిమా పెద్దగా సక్సెస్ కాలేదు. ఇక మొన్నీ మధ్య యంగ్ హీరో కిరణ్ అబ్బవరంతో 'వినరో భాగ్యము విష్ణు కథ' అనే కొత్త ప్రాజెక్ట్ ను అనౌన్స్ చేశారు. ఇప్పుడు అల్లు అరవింద్ చూపు విశ్వక్ పై పడినట్లు వార్తలు వస్తున్నాయి.

# ఫ్యాన్స్ కోసం దేవుడి అవతారమెత్తనున్న పవన్..?

టాలీవుడ్ అగ్ర కథానాయకుల్లో ఒకరైన పవన్ కళ్యాణ్ ఇప్పటి వరకు ఎన్నో రీమేక్ చిత్రాల్లో నటిస్తున్నారు. పవర్ స్టార్ కెరీర్ లో సగానికి పైగా రీమేక్ చిత్రాలే ఉన్నాయి. రీమేక్ సినిమాతో రీ ఎంట్రీ ఇచ్చిన పవన్.. మరికొన్ని రీమేక్స్ లైన్ లో పెట్టారు. షూటింగ్స్ త్వరగా పూర్తి చేయాలనే ఉద్దేశ్యంతో ఉన్నారేమో.. వీలైనంత వరకూ అలాంటి కథలకే ప్రాధాన్యతనిస్తున్నట్లు కనిపిస్తోంది.హిందీ సినిమా 'పింక్' రీమేక్ గా పవన్ కళ్యాణ్ 'వకీల్ సాబ్' సినిమా చేశారు. ఇదే క్రమంలో మలయాళ మూవీ 'అయ్యప్పనుమ్ కొశీయుమ్' రీమేక్ గా 'భీమ్లా నాయక్' మూవీ రూపొందిన సంగతి తెలిసిందే. ఇదే క్రమంలో



పవన్ 'వినోదయ సీతమ్' అనే మరో రీమేక్ కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని చాలా రోజులుగా ప్రచారం జరుగుతోంది.ప్రముఖ దర్శక నటుడు సముద్రఖని స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన తమిళ చిత్రం "వినోదయ సీతం". దేవుడు ప్రత్యక్షమై ఓ మనిషికి తన చావు గురించి ముందే చెప్పి.. అతని బరువు బాధ్యతలను ముందుగానే తీర్చేసుకోమని చెబితే పరిస్థితేంటి? అనే ఆసక్తికరమైన కథాంశంతో ఈ సినిమా రూపొందింది. ఇందులో తంబి రామస్వామి – సముద్ర ఖని ప్రధాన పాత్రల్లో నటించారు.డైరెక్ట్ ఓటీటీ రిలీజ్ అయిన ఈ సినిమా విమర్శకుల ప్రశంసలు అందుకుంది. అయితే సముద్ర ఖని పోషించిన దేవుడి పాత్రలో.. ఇప్పుడు తెలుగు రీమేక్ లో పవన్ కళ్యాణ్ కనిపించనున్నారని రూమర్స్ వస్తున్నాయి. పవన్ గతంలో వెంకటేష్ తో కలిసి నటించిన 'గోపాల గోపాల' సినిమాలో దేవుడుగా నటించారు. ఇది హిందీలో విజయం సాధించిన 'ఓ మై గాడ్' చిత్రానికి రీమేక్.అందులో అక్షయ్ కుమార్ చేసిన గాడ్ రోల్ లో పవన్ నటించి ఆకట్టుకున్నారు. ఈ క్రమంలో తమిళ్ రీమేక్ తో మరోసారి పవన్ దేవుడుగా కనిపించనున్నారట. మామూలుగానే పవన్ అభిమానులు ఆయన్ని దేవుడిగా ఆరాధిస్తుంటారు. మరి సిల్వర్ స్క్రీన్ మీద రెండోసారి దేవుడిగా దర్శనమిచ్చి ఫ్యాన్స్ ను కరుణిస్తారేమో చూడాలి.ఇకపోతే ఈ సినిమాలో మరో పాత్రలో మేనల్లుడు సాయి ధరమ్ తేజ్ నటించనున్నట్లు చెప్పుకుంటున్నారు. త్రివిక్రమ్ శ్రీనివాస్ మన నెటివిటీకి తగినట్లుగా కథలో కీలక మార్పులు చేర్పులు చేసే బాధ్యత తీసుకున్నారని టాక్ నడిచింది. జీ స్టూడియోస్ సమర్పణలో పీపుల్స్ మీడియా బ్యానర్ మీద పవన్ కళ్యాణ్ – సాయి తేజ్ ల సినిమా రూపొందనుందని వార్తలు వినిపించాయి.

# 2009లో సచిన్.. 2022లో శుబ్‌మన్ గిల్ మాత్రమే; అరుదైన రికార్డు



ఐపీఎల్ 2022 సీజన్‌లో ప్లే ఆఫ్ చేరిన తొలి జట్టుగా గుజరాత్ టైటాన్స్ నిలిచింది. లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ 62 పరుగుల తేడాతో భారీ విజయాన్ని అందుకొని 18 పాయింట్లతో దర్జాగా ప్లే ఆఫ్స్‌లో అడుగుపెట్టింది. రషీద్ ఖాన్ 4 వికెట్లతో లక్నో పతనాన్ని శాసించినప్పటికి.. అంతకముందు బ్యాటింగ్‌లో శుబ్‌మన్ గిల్ విలువైన అర్థసెంచరీ సాధించాడు. గిల్ 49 బంతుల్లో 7 ఫోర్లతో 63 పరుగులతో చివరి వరకు నాటౌట్‌గా నిలిచాడు. కాగా గిల్‌కు ఈ సీజన్‌లో ఇది నాలుగో అర్థసెంచరీ కావడం విశేషం.ఈ నేపథ్యంలో ఐపీఎల్‌లో సచిన్ టెండూల్కర్ పేరిట ఉన్న అరుదైన రికార్డును శుబ్‌మన్ గిల్ అందుకున్నాడు. 2009లో చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ తరపున ఓపెనర్‌గా వచ్చిన సచిన్ టెండూల్కర్... 49 బంతుల్లో 7 ఫోర్లతో 59 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. 20 ఓవర్ల పాటు క్రీజులో బ్యాటింగ్ చేసినా టెండూల్కర్ ఇన్నింగ్స్‌లో ఒక్క సిక్స్ కొట్టకుండానే హాఫ్ సెంచరీ సాధించాడు.తాజాగా గుజరాత్ టైటాన్స్ ఓపెనర్‌గా క్రీజులోకి వచ్చిన గిల్ 20 ఓవర్ల పాటు బ్యాటింగ్ చేసి 7 ఫోర్ల సాయంతో 63 పరుగులు చేశాడు. గిల్ ఇన్నింగ్స్‌లో కూడా సచిన్ లాగే ఒక్క సిక్సర్ కూడా లేకపోవడం విశేషం. ఇక సచిన్ టెండూల్కర్ తర్వా త ఐపీఎల్ చరిత్రలో 20 ఓవర్ల పాటు బ్యాటింగ్ చేసి ఒక్క సిక్సర్ కూడా కొట్టని రెండో బ్యాట్స్‌మెన్‌గా గిల్ చరిత్ర సృష్టించాడు.ఇక టీ20ల్లో టెస్టు బ్యాటింగ్ చేస్తాడనే అపవాదు గిల్‌పై ఉండేది. అందుకే మెగావేలానికి ముందు కేకేఆర్ అతన్ని రిటెన్షన్ చేసుకోలేదు. అయితే గుజరాత్ టైటాన్స్ మాత్రం గిల్ ఆటను నమ్మింది. మెగావేలంలో ఏకంగా రూ.8 కోట్లకు కొనుగోలు చేసింది.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**